www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -302 శనివారం 7 ఫిబ్రవరి 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# ఏం చేశారని ఓట్లడుగుతున్నారు?

## బీజేపీ నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్న



మోడీ మూడుసార్లు ప్రధాని అయినా స్మార్ట్‌సిటీ కాలేదు

గల్లీలో మోరీ తీసేందుకు ఢిల్లీ నుంచి మోడీ రావాలా..!

బీజేపీ, బీఆర్ఎస్‌కు ఓట్లేస్తే మూసీలో వేసినట్టే..

కేసీఆర్‌ను అరెస్టు నుంచి కాపాడుతుంది కిషన్‌రెడ్డే

నిజామాబాద్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన




**నిజామాబాద్‌ఫిబ్రవరి 6,ప్రజావినికిడి ,**
'బీజేపీకి ఎందుకు ఓటు వేయాలి. మూడుసార్లు మోడీ ప్రధాని అయినా నిజామాబాద్‌ను స్మార్ట్ సిటీ చేయలేకపోయారు. రాష్ట్రంలో బీజేపీ నుంచి ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నా మెట్రో విస్తరణకు, ఔటర్ రింగురోడ్డు విస్తరణకు, మూసీ ప్రక్షాళనకు కేంద్రం నుంచి నిధులు తీసుకు రాకుండా అడ్డుకుంటున్నారు. ఏం తెచ్చారని, ఇచ్చారని ఓట్లు అడుగుతున్నారు.' మిగతాది 2లో...

# బీజేపీ మేనిఫెస్టో విడుదల

తెలంగాణలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా

బీజేపీ గెలిస్తే పెండింగ్ పనుల్లో వెసులుబాటు కల్పిస్తామన్న రామచందర్ రావు

యువతకు వాకింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేస్తామని హామీ



హైదరాబాద్,**ఫిబ్రవరి 6,ప్రజావినికిడి** ,తెలంగాణలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో భాజపా విజయం సాధిస్తుందని
ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. భాజపా విజయం సాధిస్తే పెండింగ్‌లో ఉన్న పన్నుల్లో వెసులుబాటు కల్పిస్తామని, మోడ్రన్ మున్సిపాలిటీలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఫైనాన్స్ కమిషన్ ఇచ్చే నిధులను పారదర్శకంగా ఖర్చు చేస్తామన్నారు. అవినీతి రహిత మున్సిపాలిటీలే తమ లక్ష్యమని.. అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. కబ్జాలపై ఉక్కు పాదం మోపడంతో పాటు యువతకు వాకింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేస్తామన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో వీలైనన్ని ఎక్కువ స్థానాలు గెలుచుకోవడమే లక్ష్యంగా కమలం పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రాంచందర్ రావు మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను అధికారికంగా విడుదల చేశారు.ప్రధాన అంశాల్లో కోతులు, కుక్కల బెడద నివారణను చేర్చారు. మిగతాది 2లో...




# స్తంభించిన పార్లమెంట్

## లోక్‌సభలో స్పీకర్ తీరుపై ప్రతిపక్షాల ఆగ్రహం

ఉభయ సభల్లో అంతరాయం..

సోమవారానికి వాయిదా




న్యూఢిల్లీ
మోడీ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు చేపట్టిన ఆందోళనతో పార్లమెంట్ శుక్రవారం స్తంభించింది. ఉభయ సభల్లో వరుసగా ఐదో రోజు అంతరాయం కలిగింది. 2లో...

# రుణ గ్రహీతలకు ఊరట..

## కీలక వడ్డీ రేట్లు యథాతథం

రెపో రేటును యథాతథంగా ఉంచిన ఆర్బీఐ

5.25 శాతంగా కొనసాగనున్న వడ్డీ రేటు

ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్న ద్రవ్య పరపతి కమిటీ

ద్రవ్యోల్బణం అదుపులోనే ఉందని వెల్లడి

'న్యూట్రల్' విధానానికే కట్టుబడిన రిజర్వ్ బ్యాంక్



# మున్సిపల్ ఎన్నికల్లో రెండు పార్టీలకూ బుద్ధి చెప్పాలి

కుల, మతాల పేరుతో ఓట్లు దండుకుంటున్న బీజేపీ

హామీలు అమలు చేయని మోసకారి కాంగ్రెస్

వేములవాడలో ఎన్నికల ప్రచారసభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**వేములవాడఫిబ్రవరి 6,ప్రజావినికిడి ,**
కులం, మతం పేరుతో ఓట్లు అడుగుతున్న బీజేపీ, హామీలను అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్‌కు మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో శుక్రవారం మిగతా 2లో...

# పార్టీ ఫిరాయింపులపై స్పీకర్‌కు డెడ్‌లైన్

మరో మూడు వారాల సమయం

అప్పటికీ నిర్ణయం తీసుకోకపోతే కోర్టు ధిక్కార చర్యలపై ఆలోచిస్తాం

స్పష్టం చేసిన సర్వోన్నత న్యాయస్థానం



న్యూఢిల్లీ**ఫిబ్రవరి 6,ప్రజావినికిడి ,**
పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల అంశంలో నిర్ణయం తీసుకునేందుకు సుప్రీంకోర్టు స్పీకర్‌కు మరో మూడు వారాల సమయం ఇచ్చింది. అప్పటికీ నిర్ణయం తీసుకోకపోతే కోర్టు ధిక్కార చర్యలపై ఆలోచన చేస్తామని హెచ్చరించింది. బీఆర్ఎస్ బీ ఫారం నుంచి కారు గుర్తుపై గెలిచిన శాసన సభ్యులు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరి మిగతాది 2లో...


# విశ్వవిజేత భారత్...

## అండర్19 క్రికెట్‌వరల్డ్ కప్ ఫైనల్లో ఇంగ్లండ్‌పై గ్రాండ్ విక్టరీ

కేవలం 80 బంతుల్లో 175 పరుగులతో విధ్వంసం సృష్టించిన వైభవ్ సూర్యవంశీ

భారీ లక్ష్యఛేదనలో ఫల్కనర్ (115) సెంచరీతో ఒంటరి పోరాటం చేసినా ఇంగ్లండ్‌కు తప్పని ఓటమి

టోర్నీ ఆద్యంతం అద్భుత ప్రదర్శనతో అపజయం ఎరుగకుండా టైటిల్ నెగ్గిన టీమిండియా



**ఢిల్లీ ఫిబ్రవరి 6,ప్రజావినికిడి ,**
అండర్-19 క్రికెట్‌లో భారత యువ జట్టు మరోసారి తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. హరారే వేదికగా జరిగిన ప్రపంచకప్ ఫైనల్లో ఇంగ్లండ్‌పై 100 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. తద్వారా రికార్డుస్థాయిలో ఆరోసారి అండర్-19 ప్రపంచకప్‌ను ముద్దాడి చరిత్ర సృష్టించింది మిగతాది 2లో...

# మనకెందుకులే అనుకోవద్దు...

## ప్రతి భక్తుడిపై ధార్మిక బాధ్యత ఉంటుంది: పవన్ కల్యాణ్

హిందూ ధర్మంపై దాడులు జరిగినప్పుడు మౌనం వీడాలని పవన్ పిలుపు

కేవలం భక్తులుగా కాకుండా ధర్మ సంరక్షకులుగా ఉండాలన్న డిప్యూటీ సీఎం

కులం, ప్రాంతం వేరైనా మన ధర్మం ఒక్కటేనని వ్యాఖ్య

మన విశ్వాసాలను కాపాడుకోవడమంటే ఇతర మతాలకు వ్యతిరేకం కాదని స్పష్టీకరణ



# ఏం చేశారని ఓట్లడుగుతున్నారు?

(మొదటి పేజీ తరువాయి)

అని కేంద్ర మంత్రులను, బీజేపీ ఎంపీలను, బీజేపీ నేతలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నిం చారు. 'మున్సిపల్ మంత్రిగా నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని ఏడు మున్సిపాల్టీల అభివృద్ధికి రూ.1045 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నాం.

పదేండ్లు బీఆర్ఎస్‌కు, పన్నెండేండ్లు బీజేపీకి అధికారం ఇచ్చినా.. మున్సిపాల్టీలు మురికి కూపంగానే ఉన్నాయి. గల్లీల్లో మోరీలు తీయాలంటే ఢిల్లీ నుంచి మోడీని పిలవాలా..? 'గాడిదకు గడ్డి వేసి ఆవు నుంచి పాలు పిండటం సబబా? బీఆర్ఎస్, బీజేపీకి ఓట్లు వేసి అభివృద్ధి పనులు కాంగ్రెస్ చేయాలంటే సాధ్యమా..? ఇప్పుడు మంచి అవకాశం వచ్చింది. స్థానికంగా మనోడే ఉండాలే. నిజామాబాద్ కార్పొరేషన్‌తో పాటు ఏడు మున్సిపాల్టీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మోడీ వద్ద పరపతి ఉందని చెప్పుకునే ఎంపీ అరవింద్ నిజామాబాద్‌ను ఎందుకు స్మార్ట్ సిటీగా ఎంపిక చేయలేదని ప్రశ్నించారు. ఆయన వద్ద పరపతి లేదని అర్థమవుతోందని అన్నారు. నిజామాబాద్ ఔటర్‌రింగ్ రోడ్డుకు నిధులిస్తే తాము వద్దన్నామా..? అని ప్రశ్నించారు.

నిజామాబాద్ జిల్లాకు మంజూరైన మూడు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు, తెలంగాణ యూనివర్సిటీలో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి.. మంత్రు లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్‌అలీతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం బర్దిపూర్ శివారులో రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన 'ప్రజాపాలన–ప్రగతిబాట' బహిరంగసభలో ప్రసంగించారు. నిజామాబాద్ జిల్లాకు గొప్ప చరిత్ర ఉందని.. ఖిల్లా జైలు గోడల మీద దాశరథి 'నా తెలంగాణ కోట రతనాల వీణ' అని నినదించారని, ఇక్కడి రైతులు పోరాట పటిమ



గలిగిన వారని, చైతన్యవంతులని, జిల్లా రైతుల వ్యవసాయం దేశానికే ఆదర్శమని అన్నారు. ఇక్కడి రైతుల పక్షాన పోరాటం చేయడంతో కాంగ్రెస్ అధిష్టానం దృష్టిలో పడి సీఎం అయ్యానని, తన మనుసులో నిజామాబాద్‌కు ప్రత్యేక స్థానం ఉన్నట్టు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లాకు అత్యధిక నిధులు మంజూరు చేయడానికి శాయశక్తులా ప్రయత్నిస్తానని తెలిపారు.

కాంగ్రెస్ హయాంలో కట్టిన ఎస్సారెస్పీ ఇప్పటికీ ధృడంగా ఉండి పంటలకు నీరందిస్తోందని, కానీ గోదావరి జలాల పేరుతో తెలంగాణను కొల్లగొట్టారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'కేసీఆర్, హరీశ్‌రావును జైలులో పెట్టి చిప్పకూడు తినిపించాలని ధర్మపురి అర్వింద్ అంటుంటా రని, కాళేశ్వరం బీఆర్ఎస్ పార్టీకి ఏటీఎంగా మారిందని, సీబీఐకి కేసు అప్పగిస్తే 48 గంటల్లో కేసీఆర్‌ను అరెస్టు చేస్తామని పలికిన కిషన్‌రెడ్డి ఎక్కడ దాక్కున్నారని ముఖ్య మంత్రి ప్రశ్నించారు. సీబీఐకి ఇచ్చి ఆరు నెలలవుతున్నా అరెస్టు చేయనీయకుండా ఎందుకు అడ్డుకుంటున్నారని అడిగారు. ఈ విషయంలో ధర్మపురి అర్వింద్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. శాసనసభలో చర్చ పెట్టి కాళేశ్వరాన్ని సీబీఐకి ఇచ్చాంఇప్పటి వరకు సీబీఐ పట్టించుకోలేదన్నారు. కిషన్‌రెడ్డి కేసీఆర్‌ను ఏ రకంగా కాపాడుతున్నాడో తెలియడం లేదా..? అని అన్నారు.

'నీ పక్కన కూసున్న కిషన్‌రెడ్డి కేసీఆర్‌ను కాపాడుతున్నాడు. అసలు ఎందుకు కాపాడుతున్నాడో అడుగు. కల్వకుంట్ల కిషన్‌రావు అయ్యాడు. కేసీఆర్‌కు దొంగపుత్రుడు కేటీఆర్ ఉంటే.. దత్తపుత్రుడు 'కిషన్‌రావు' అని ఆయనను జనజీవన స్రవంతిలోకి తీసుకురావాలి' అని సీఎం రామచంద్రారావుకు సూచించారు. 70 వేల ఉద్యోగాలు కల్పించామని, ఎల్‌బీ స్టేడియానికి వస్తే 70 వేల తలలు లెక్కపెట్టుకోవచ్చని హితవు పలికారు. గ్రూప్–1పై హైకోర్టు తీర్పు బీఆర్ఎస్‌కు చెంపపెట్టని అన్నారు. 562 మందికి నియామకపత్రాలు అందజేస్తామని తెలిపారు. మున్సిపాల్టీ ల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామని అన్నారు. 2029లో సీఎంగా నేను, పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీని మళ్లీ అధికారంలోకి తెస్తామని ధీమా వ్యక్తం చేశారు.

రేవంత్‌రెడ్డి మాదిగ.. రేవంతుద్దీన్.. అన్నా స్వీకరిస్తా

'బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు నన్ను రేవంతుద్దీన్ అని సంభోదించారు. సంతోషమే. బ్రిటీష్ కాలం పరిపాలన అనంతరం వందేండ్ల తర్వాత దేశంలో ఏ రాష్ట్రం చేయలేని విధంగా కులగణన చేపట్టి బీసీ జనాభా లెక్కలు తీస్తే టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ నన్ను రేవంత్‌గౌడ్‌గా అభివర్ణిస్తే స్వీకరించా. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం 100 రోజుల్లో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేపట్టి 40 ఏండ్ల సమస్యను పరిష్కరిస్తే.. మంత్రి దామోదర రాజనర్సింహా రేవంత్ మాదిగ అని పిలిస్తే సంతోషమనిపించింది.

30 ఏండ్లుగా కార్యకర్తగా పనిచేసిన వాకటి శ్రీహరికి ఎమ్మెల్యే, మంత్రి పదవి అప్పగిస్తే రేవంత్ ముదిరాజ్ అన్నారు. అనిల్‌కుమార్ యాదవ్‌ను రాజ్యసభకు పంపితే నన్ను రేవంత్ యాదవ్ అంటూ అక్కున చేర్చుకున్నారు. స్వర్ణ దేవాలయాన్ని నిర్మిస్తానన్నందుకు నన్ను సర్దార్ రేవంత్‌సింగ్ అని సిక్కు సోదరులు పిలిచారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్‌లు కల్పించాం. సీటు త్యాగం చేసి ఓడి పోయిన షబ్బీర్‌అలీకి పదవి ఇచ్చా. అజారుద్దీన్‌ను మంత్రిని చేశా. కాబట్టి రేవంతుద్దీన్ అని పిలిచినా పర్వాలేదు. కులాలను, మతాలను సమన్వయం చేసుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు తీసుకెళ్తున్నా' అని సీఎం వ్యాఖ్యానించారు.

## పార్టీ ఫిరాయింపులపై స్పీకర్‌కు డెడ్‌లైన్

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ ఫిరాయించారని పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్ సుప్రీంకోర్టులో గతేడాది జనవరి 15న స్పెషల్ లీవ్ పిటిషన్(సివిల్) దాఖలు చేశారు. అదేరోజు ఎమ్మెల్యేలు పరిగి శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కాలే యాదయ్య, టీ ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, ఎం సంజయ్ కుమార్ పార్టీలు ఫిరాయించారని కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్, జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, చింత ప్రభాకర్, కల్వకుంట్ల సంజయ్ సుప్రీంలో రిట్ పిటిషన్(సివిల్) వేశారు.ఆ తర్వాత వాదనలు జరుగుతుండగానే మార్చి 18న బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పెషల్ లీవ్ పిటిషన్(సివిల్) దాఖలు చేశారు. దానం నాగేందర్‌ని ప్రతివాదిగా చేర్చారు. ఈ అన్నీ పిటిషన్లపై గతంలో సీజేఐ ధర్మాసనం విచారణ జరిపి గత జులై 31 వరకు ఫిరాయింపులపై చర్యలు తీసుకోవాలని స్పీకర్ కార్యాలయాన్ని ఆదేశించారు. అయితేడ స్పీకర్ కార్యాలయం ఈ మూడు నెలల కాలం ముగించే సమయానికి.. మరింత గడువు కావాలని సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఇదే సందర్భంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై కోర్టు ధిక్కార పిటిషన్‌తో పాటు, మరో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే పాడి కౌశిక్ రెడ్డి, ఇతరులు మిస్ లీనియస్ అప్లికేషన్లు వేశారు. ఈ పిటిషన్లపై శుక్రవారం జస్టిస్ సంజయ్ కరోల్ నేతృత్వంలోని జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ ద్విసభ్య ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. స్పీకర్ కార్యాలయం తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, పిటిషనర్లు కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి, ఇతరుల తరపున ఏఓఆర్ మోహిత్ రావు హాజరయ్యారు.తొలుత స్పీకర్ తరపున సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. మొత్తం పది అనర్హత పిటిషన్లలో ఎనిమిదింటిని స్పీకర్ పరిష్కరించారని కోర్టుకు నివేదించారు. గత విచారణ తరువాత జరిగిన పురోగతిని ధర్మాసనానికి నివేదించారు. ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు కొంత సమయం అడిగారని తెలిపారు. అందువల్ల మిగిలిన రెండు పిటిషన్ల పరిష్కారానికి మరో మూడు వారాల సమయం కావాలని కోరారు. మార్చి నెల మధ్యలోగా మిగిలిన వాటిపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని కోర్టుకు వివరించారు.స్పీకర్ తరపు అభ్యర్థనపై పిటిషనర్ల తరపు న్యాయవాది మోహిత్ రావు అభ్యంతరం తెలిపారు. ఇప్పటికే చాలా ఆలస్యం జరిగిందని కోర్టుకు దృష్టికి తీసుకెళ్లారు. దాదాపు 16 నెలలుగా ఈ కేసు నడుస్తోందని, ఉద్దేశపూర్వకంగానే విచారణలో తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. 'ఒక ఎమ్మెల్యే గెలిచిన ఆరు నెలలకే పార్టీ ఫిరాయించి, కాంగ్రెస్ గుర్తుపై ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. పార్టీ ఫిరాయించిన మరో ఎమ్మెల్యే కుమార్తె కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేస్తే సంబంధిత ఎమ్మెల్యే ప్రచారం చేశారని ఉద్వేగంగా వాదనలు వినిపించారు. వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకునేలా చూడాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు.ఈ వాదనలపై స్పందించిన ధర్మాసనం, గత ఆదేశాల ప్రకారం కేసులో పురోగతిని స్పీకర్ కార్యాలయం తెలిపిందన్నారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని మరో మూడు వారాలు సమయం ఇస్తున్నట్టు జస్టిస్ సంజయ్ కరోల్ వెల్లడించారు. అప్పటికీ స్పీకర్ కార్యాలయం నిర్ణయం తీసుకోకపోతే, కోర్టు ధిక్కరణ చర్యలపై ఆలోచన చేస్తామని ధర్మాసనం పేర్కొంది. మరోవైపు కోర్టులో జరిగిన వాదనలను సోషల్ మీడియాలో పలువురు న్యాయ వాదులు, ఇతరులు వైరల్ చేస్తోన్న అంశంపై ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటివి చేయొద్దని వ్యాఖ్యానించింది.

## విశ్వవిజేత భారత్...

(మొదటి పేజీ తరువాయి)

తొలుత బ్యాటింగ్‌లో పరుగుల సునామీ సృష్టించి, ఆపై బౌలింగ్‌లో అద్భుతంగా రాణించి ఇంగ్లండ్‌ను ఆలౌట్ చేసింది.భారత్ నిర్దేశించిన 412 పరుగుల భారీ లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. బెన్ డాకిన్స్ (66), బెన్ మేయస్ (45) వేగంగా పరుగులు సాధించారు. అయితే, భారత బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు తీసి ఇంగ్లండ్‌ను దెబ్బకొట్టారు. ఒక దశలో 177 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచింది. ఈ సమయంలో కాలెబ్ ఫల్కనర్ (67 బంతుల్లో 115) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 9 ఫోర్లు, 7 సిక్సర్లతో అద్భుత శతకం బాది ఒంటరి పోరాటం చేశాడు. అతనికి జేమ్స్ మింటో (28) నుంచి కొంత సహకారం లభించినా, అది గెలుపునకు సరిపోలేదు. భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో ఇంగ్లండ్ పోరాటం 40.2 ఓవర్లలో 311 పరుగుల వద్ద ముగిసింది. భారత బౌలర్లలో ఆర్ఎస్ అంబ్రీష్ 3 వికెట్లతో సత్తా చాటగా, కనిష్క్ చౌహాన్, దీపేష్ దేవేంద్రన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.అంతకుముందు, టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టుకు ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర ఆరంభాన్ని ఇచ్చాడు. కేవలం 80 బంతుల్లో 15 ఫోర్లు, 15 భారీ సిక్సర్లతో ఏకంగా 175 పరుగులు చేసి ఇంగ్లండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతని ఇన్నింగ్స్‌తో భారత్ భారీ స్కోరుకు బలమైన పునాది పడింది. కెప్టెన్ ఆయుష్ మాత్రే (53) బాధ్యతాయుతమైన అర్ధశతకంతో రాణించగా, వేదాంత్ త్రివేది (32), విహాన్ మల్హోత్రా (30), వికెట్ కీపర్ అభిగ్యాన్ కుండు (40) విలువైన పరుగులు జోడించారు. చివర్లో కనిష్క్ చౌహాన్ (20 బంతుల్లో 37 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 411 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. ఇంగ్లండ్ బౌలర్లలో జేమ్స్ మింటో 3 వికెట్లు తీశాడు.భారత్ గతంలో 2000, 2008, 2012, 2018, 2022లో అండర్–19 కప్ ను గెలిచింది. ఇప్పుడు రికార్డు స్థాయిలో ఆరోసారి కప్ సాధించి, అండర్–19 ప్రపంచకప్ చరిత్రలో తన తిరుగులేని ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించుకుంది. మ్యాచ్ అనంతరం భారత ఆటగాళ్లు త్రివర్ణ పతాకాలను చేతబూని మైదానంలో సంబరాలు జరుపుకున్నారు.

## రుణ గ్రహీతలకు ఊరట..

**ఢిల్లీ ఫిబ్రవరి 6,ప్రజావినికిడి ,**

భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) కీలక వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచింది. పాలసీ రెపో రేటును ప్రస్తుతమున్న 5.25 శాతం వద్దే కొనసాగించాలని ద్రవ్య పరపతి కమిటీ (ఎంపీసీ) ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. దీంతో పాటు తమ 'న్యూట్రల్ మానిటరీ పాలసీ' వైఖరికే కట్టుబడి ఉన్నట్లు ఆయన స్పష్టం చేశారు.

దేశ ఆర్థిక పరిస్థితులు, భవిష్యత్ అంచనాలను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు గవర్నర్ తెలిపారు. గత డిసెంబర్ సమావేశం తర్వాత ప్రపంచవ్యాప్తంగా ప్రతికూలతలు పెరిగినప్పటికీ, ప్రభుత్వం కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాలు ఆర్థిక వ్యవస్థకు సానుకూలంగా ఉన్నాయని ఆయన అన్నారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రిస్తూనే, వృద్ధికి ఆటంకం కలగకుండా సమతౌల్యం పాటించడమే 'న్యూట్రల్' వైఖరి ఉద్దేశమని వివరించారు.

ద్రవ్యోల్బణం అదుపులోనే ఉందని, ఆర్బీఐ నిర్దేశించిన సహన పరిమితి కంటే తక్కువగా ఉందని మల్హోత్రా పేర్కొన్నారు. 2026–27 ఆర్థిక సంవత్సరం తొలి రెండు త్రైమాసికాలకు సీపీఐ ద్రవ్యోల్బణ అంచనాలను వరుసగా 4 శాతం, 4.2 శాతానికి సవరించినట్లు తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి అంచనాలు ఆశాజనకంగా ఉన్నాయని, దేశీయ అంశాలే దీనికి కారణమని ఆయన అభిప్రాయపడ్డారు.గత డిసెంబర్‌లో జరిగిన సమీక్షలో వృద్ధిని ప్రోత్సహించేందుకు ఆర్బీఐ రెపో రేటును 5.5 శాతం నుంచి 5.25 శాతానికి (25 బేసిస్ పాయింట్లు) తగ్గించిన విషయం తెలిసిందే. అంతకుముందు ఆగస్టు, అక్టోబర్‌లలో రేట్లను స్థిరంగా ఉంచింది. ప్రస్తుతం రేట్లలో మార్పు లేనందున గృహ, వాహన రుణాలతో సహా ఇతర రుణాలపై వడ్డీ రేట్లు ఇప్పట్లో పెరిగే అవకాశం లేదు.

## స్తంభించిన పార్లమెంట్

(మొదటి పేజీ తరువాయి)

లోక్‌సభ, రాజ్యసభ ఎలాంటి ముఖ్యమైన చర్చలు జరపకుండానే సోమవారం వరకు వాయిదా పడ్డాయి. అమెరికా ప్రయోజనాలకు పూర్తిగా లొంగిపోవడం, వాణిజ్య ఒప్పందాలపై సంతకం చేయడం, భారత్–చైనా ఉద్రిక్తత సమయంలో కీలకమైన నిర్ణయాలను ఆలస్యం చేయడం వంటి ఆరోపణలను మోడీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ప్రధానంగా చేశాయి. శుక్రవారం లోక్‌సభ ప్రారంభమైన వెంటనే, ప్రతిపక్షాలు తీవ్ర నిరసనలు తెలిపాయి. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన వివాదాస్పద పుస్తకం 'ఫర్ ది స్టార్స్ ఆఫ్ డెస్టినీ' చిత్రాలతో కూడిన బ్యానర్‌లను పట్టుకుని ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు. 'నియంతృత్వాన్ని అనుమతించరు', 'ప్రతిపక్షాలను మాట్లాడటానికి అనుమతించాలి', 'నరేంద్ర లొంగిపోయారు' వంటి నినాదాలు సభలో హోరెత్తాయి.దీని తరువాత, సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైనప్పుడు కూడా ప్రతిపక్షాల నిరసనలు తగ్గలేదు. పోస్టర్లు, ప్లకార్డులు, బ్యానర్ల నినాదాలు కొనసాగాయి. ప్రధాని లోక్‌సభను ఎదుర్కోవడానికి భయపడుతున్నారని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. ఈ సమావేశంలో 19 గంటల 13 నిమిషాలు నిరంతర నిరసనలతో సమయం వృథా అయ్యిందని స్పీకర్ ఆరోపించారు. అయితే, ప్రతిపక్షాల డిమాండ్లను ఆమోదించే వరకు బడ్జెట్ చర్చలకు తాము ఏ విధంగానూ సహకరించబోమని, తమ వైఖరిలో మార్పు లేదని ప్రతిపక్షం స్పష్టం చేసింది. అనంతరం సభను సోమవారం వరకు వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. రాజ్యసభలో కూడా ఇలాంటి నిరసనలే జరిగాయి. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాల నిరసనలు పార్లమెంటు వెలుపలా కొనసాగాయి. 'ఎటువంటి ఒప్పందం అనుమతించబడదు' అనే బ్యానర్‌తో ప్రతిపక్ష సభ్యులు పార్లమెంట్ గేటు వద్ద నిరసన తెలియజేశారు. సస్పెండైన ఎంపీలు కూడా ఈ నిరసనలో పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో రెండు పార్టీలకూ బుద్ధి చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

మున్సిపల్ ఎన్నికల ప్రచార సభలో నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావుతో కలిసి కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ దొంగ హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజల్ని మోసం చేస్తోందని ఆరోపించారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీనీ సరిగా అమలు చేయలేదన్నారు. ఎన్నికల సమయంలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బాండ్ పేపర్‌పై రాసి ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తానన్న హామీని గుర్తు చేస్తూ.. ఆ బాండ్ పేపర్‌ను సభలో ప్రజల ముందు ప్రదర్శించారు. నాలుగు సార్లు ఓడిపోయానని, ఈసారి ఓటు వేయకపోతే చనిపోతానని సానుభూతి డైలాగులతో ప్రజలను మభ్యపెట్టిన ఆది శ్రీనివాస్.. ఆ తర్వాత అభివృద్ధి గురించి పట్టించుకోలేదని విమర్శించారు.వేములవాడ నియోజకవర్గానికి ఏం చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇన్ని మోసాలు, ద్రోహాల తర్వాత కూడా ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే, ప్రజలు తమ మోసాలను ఆమోదించినట్టేనని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. అలా జరిగితే భవిష్యత్‌లో హామీల అమలుపై దృష్టి పెట్టే అవకాశమే ఉండదన్నారు. రూ.4 వేల పెన్షన్, ఆసరా పెన్షన్, రైతు భరోసా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, తులం బంగారం వంటి హామీలు అమలు కావాలంటే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. అప్పుడే తమ మోసాలపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్న విషయం ప్రభుత్వానికి అర్థమవుతుందని చెప్పారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా తెలంగాణకు చేసింది ఏమీ లేదని కేటీఆర్ విమర్శించారు.ఇదే పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రెండుసార్లు ప్రాతినిధ్యం వహించిన కేంద్ర మంత్రి బండి సంజరు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. ప్రతి ఇంటికీ రూ.15 లక్షలు ఇస్తానన్న ప్రధాని మోడీ హామీ ఏమైందని నిలదీశారు. ఎన్నికలొచ్చినప్పుడల్లా దేవుడి పేరు, కులం, మతం పేరుతో ప్రజలతో ఓట్లు వేయించుకోవడమే బీజేపీ పని అని ఆరోపించారు. బీజేపీ దొంగ మాటలను నమ్మొద్దని, పేదల కడుపులు నింపి తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్‌ను గుర్తు పెట్టుకొని బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల్లో వేసే ప్రతి ఓటూ మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసే ప్రస్థానానికి తొలి అడుగుగా మారాలని అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, మున్సిపల్ అభ్యర్థులు నిమ్మచెట్టి విజయ్, గోలి మహేష్, మారం కుమార్, నరాల శేఖర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## బీజేపీ మేనిఫెస్టో విడుదల

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. మున్సిపల్ ఎన్నికల రాష్ట్ర సహ ఇన్‌ఛార్జిలు అశోక్ పర్ణామి, రేఖాశర్మతో కలిసి వికసిత తెలంగాణ.. భాజపా సంకల్ప పత్రం పేరుతో మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను రామచందర్ రావు విడుదల చేశారు.కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు భాజపాను చూసి భయపడుతున్నాయని అని రామచందర్ రావు అన్నారు. కేంద్రం.. తెలంగాణకు ఏం ఇచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నిస్తున్నారని మండిపడ్డారు. కేంద్రం రాష్ట్రానికి ఏం ఇచ్చిందో.. జిల్లాల వారీగా చెబుతామని, రేవంత్ రెడ్డి జిల్లాలకు ఏం ఇచ్చారో చెప్పగలరా అని సవాల్ విసిరారు. పోలీసులు భాజపా కార్యకర్తలపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగుండం, మంచిర్యాలలో పార్టీ కార్యకర్తలపై కాంగ్రెస్ దాడులు చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ పోలీసులను కార్యకర్తల్లా ఉపయోగించుకుంటుందని దుయ్యబట్టారు. పోలీసులు బీజేపీ కార్యకర్తలపై దాడులు చేస్తే మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కేంద్రంలో భాజపా సర్కార్ ఉన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. పన్నుల పెంపు లేదు, వారం రోజుల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు, బస్తీ దవాఖానలు, స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి, క్లీన్ సిటీ, గ్రీన్ టౌన్. 100 శాతం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ , దేవాలయాల రక్షణ, మహిళల రక్షణ. మున్సిపాలిటీల్లో దోమలు, పందులు, కుక్కలు, కోతుల బెడద నివారణ. సమ్మిళిత, సుస్థిర అభివృద్ధి కోసం బీజేపీ మేనిఫెస్టో అంటూ రూపకల్పన తొలిసారి తెలంగాణలో అన్ని మున్సిపల్ వార్డుల్లో పోటీ చేస్తున్న బీజేపీ మెజారిటీ స్థానాల్లో కాషాయ జెండా ఎగురవేయాలని పార్టీ పట్టుదలతో ఉంది. 60 శాతానికి పైగా మున్సిపాలిటీలు, కనీసం 5 కార్పొరేషన్లను దక్కించుకోవాలని టార్గె÷ట్ పెట్టుకుంది. ఇందుకోసం స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కష్టపడుతున్నారు. బీజేపీ యువ మోర్చాకు ఈ ఎన్నికల్లో ప్రత్యేక టాస్క్ ఇచ్చారు. జెన్–జీ టార్గెట్‌గా ప్రచారంలో వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని దిశానిర్దేశర చేశారు..

## మనకెందుకులే అనుకోవద్దు...

### ప్రతి భక్తుడిపై ధార్మిక బాధ్యత ఉంటుంది: పవన్ కల్యాణ్



విజయవాడ,**ఫిబ్రవరి 6,ప్రజావినికిడి ,**

ప్రతి భక్తుడిపై ధార్మిక బాధ్యత ఉంటుందని, హిందూ దేవుళ్లను, ధర్మాన్ని కించపరిచినప్పుడు మౌనంగా ఉండకుండా తమ గళాన్ని వినిపించాలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. సగటు హిందువు మనస్తత్వంలో మార్పు రావాలని, భయంతో లేదా సౌలభ్యం కోసం మౌనంగా ఉండే ధోరణిని వీడాలని ఆయన సూచించారు. దేవుడిపై భయం, విశ్వాసంపై గౌరవం ఉన్నప్పటికీ, మన ధర్మాన్ని ఎవరైనా దురుద్దేశంతో అపహాస్యం చేసినప్పుడు కేవలం వ్యక్తిగతంగా బాధపడి, కర్మకు వదిలేసి ముందుకు సాగే అలవాటు మారాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.పవన్ కల్యాణ్ తన అభిప్రాయాలను వివరిస్తూ, "మనం కులం, మతం, ప్రాంతం, భాషల పరంగా విభజనకు గురై ఉండవచ్చు. కానీ మనందరి ధర్మం ఒక్కటే, దేవుళ్లు కూడా అంతే. మన విశ్వాసాలను, ధర్మాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించినప్పుడు మన బాధను తెలియజేయడం మనందరి కర్తవ్యం. ఇలాంటి కీలక సమయాల్లో పాటించే మౌనం సమిష్టి చైతన్యాన్ని బలహీనపరుస్తుంది" అని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ కేవలం భక్తులుగా మిగిలిపోకుండా, తమ విశ్వాసాలకు స్పృహతో కూడిన సంరక్షకులుగా కూడా వ్యవహరించాలని ఆయన కోరారు.

హిందూ ధర్మాన్ని రక్షించుకోవడమంటే ఇతర మతాలకు వ్యతిరేకంగా ఉండటం కాదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తమ సొంత విశ్వాసాలను, సంప్రదాయాలను కాపాడుకోవడం మాత్రమేనని ఆయన వివరించారు. హిందువులు తమ ధార్మిక బాధ్యతను గుర్తించి, సోమరితనం వీడి, తమ విశ్వాసాల పరిరక్షణకు సమిష్టిగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మార్పు ద్వారానే హిందూ ధర్మం యొక్క గౌరవాన్ని కాపాడుకోగలమని ఆయన ట్వీట్ చేశారు.

### ఆటో క్యాబ్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ

# ఫిబ్రవరి 12న రాష్ట్ర వ్యాప్త బంద్

## తెలంగాణ రాష్ట్ర ఆటో,క్యాబ్,టాక్సీ, లారీ డ్రైవర్ల జేఏసీ ప్రకటన



**ప్రజావినికిడి, (హిమాయత్ నగర్):**
కేంద్రంలో బీజేపీ సర్కార్, రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ ఆటో,క్యాబ్,టాక్సీ, లారీ డ్రైవర్లలకు ఇచ్చిన హామీల అమలుకై, మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా రవాణారంగా కార్మికులు ఫిబ్రవరి 12న రాష్ట్ర వ్యాప్త బంద్ పాటిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ఆటో,క్యాబ్, టాక్సీ,లారీ డ్రైవర్ల జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం (ఏఐటీయూసీ),కో కన్వీనర్ లు వి.మారయ్య (బిఆర్టీయు), రామకృష్ణ రెడ్డి (ఐఎన్టియుసి), వి.ప్రవీణ్ (టియుసిఐ), యాదగిరి (టిఎన్టియుసి), సత్తి రెడ్డి (టిఏడిఎస్), అమానుల్లా ఖాన్, షేక్ మజీద్ (ఐఎల్ డబ్ల్యూ.ఎఫ్), శ్రీనివాస్ (జియుటిఎస్), ఎస్.దయానంద్ (టిటిడబ్ల్యూయు), శివ ఆనంద్ (టిఏఎండియు) హైదరాబాద్, బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్ లో శుక్రవారం జరిగిన విలేఖరుల సమావేశంలో ప్రకటించారు. ఈ సందర్భంగా బంద్ గోడ పత్రిక ను ఆవిష్కరించి బి.వెంకటేశం మాట్లాడుతూ, నూతన మోటార్ వాహన చట్టం, నాలుగు లేబర్ కోడ్ లు తీసుకువచ్చి కేంద్ర ప్రభుత్వం రవాణారంగా కార్మికుల నడ్డి విరిచడాన్ని నిరసిస్తూ, రాష్ట్రంలో ఎన్నికల మానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఆటో కార్మికులకు ఆటో మీటర్ చార్జీలు పెంచుతానని, ఆటో రవాణారంగా కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు,ప్రతి ఆటో డ్రైవర్ కు సంవత్సరానికి రూ.12 వేలు ఆర్థిక సహాయం వంటి హామీలిచ్చి అమలు చేయకుండా నిర్లక్ష్యం చేయడాన్ని నిరసిస్తూ ఫిబ్రవరి 12న రాష్ట్ర వ్యాప్త బంద్ పాటిస్తున్నామని తెలిపారు. ఈ బంద్ లో రాష్ట్ర వ్యాప్తంగా డ్రైవర్లు, రవాణారంగా కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వి.మారయ్య మాట్లాడుతూ, గ్రేటర్ హైదరాబాద్ లో అక్రమంగా నడుస్తున్న ఇతర జిల్లాల ఆటోలు,ఓలా, రాపిడో,ఉబర్ ద్వారా అక్రమంగా నడుస్తున్న టూ వీల్లర్ లను వెంటనే నిషేదించాలని డిమాండ్ చేశారు. రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మోటార్ వాహన చట్టం 2019ను ఆటో డ్రైవింగ్ లైసెన్సు సారధి వాహన పోర్ట్ ను వెంటనే రద్దు చేయాలన్నారు. వి.ప్రవీణ్ మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల మధ్య కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్ ను అమలు చేయాలనీ కోరారు. యాదగిరి మాట్లాడుతూ, హెవీ డ్రైవింగ్ స్కూల్ లను పథ ఉమ్మడి జిల్లాలలో ఏర్పాటు చేయాలన్నారు. సత్తి రెడ్డి మాట్లాడుతూ, 15 సంవత్సరాలు దాటినా వాహనాలకు కేంద్ర ప్రభుత్వం పెంచిన ఫిట్నెస్ రెన్యువల్ చార్జీలను తగ్గించాలని అన్నారు. అమానుల్లా ఖాన్ మాట్లాడుతూ, ఆటో,క్యాబ్ లకు ఈ చలాన్ ల నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ ఆటో డ్రైవర్స్ యూనియన్ నేతలు ఎస్.అశోక్, సిహెచ్.జంగయ్య, నరసింహ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వేలాది మందితో నేడు శ్యామ్ బాబా భారీ రథయాత్ర




**ప్రజావినికిడి, (హిమాయత్ నగర్):**
వేలాది మంది భక్తులతో ఫాల్గుణ మాసం సందర్భంగా రేపు ఫిబ్రవరి 8న శ్యామ్ బాబా భారీ రథయాత్రను నిర్వహిస్తున్నట్లు శ్యామ్ బాబా రథయాత్ర కమిటీ చైర్మన్ ఇంద్రకరణ్ అగర్వాల్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా రథయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహాభారతంలోని పాండవులలో ఒకరైన భీముని మనవడైన బర్బరీకుడికి అంకితం చేయబడిన ఖాటు శ్యామ్ జీ ఆలయం భారతదేశంలోని రాజస్థాన్ రాష్ట్రం సికర్ జిల్లా ఖాటు గ్రామంలో ఉందని, దక్షిణ భారతదేశంలో మొదటి ఖాటు శ్యామ్ జీ ఆలయం హైదరాబాద్‌లోని కాచిగూడ వీరన్న గుట్ట పై ప్రసిద్ధి చెందిందని,ఈ ఆలయాన్ని శ్రీ కంచి కామకోటి పీఠం,శ్రీ శ్యామ్ మందిర్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందన్నారు. ఇక్కడ నిత్యం పూజలు, అభిషేకం, భక్తులకు శ్యామ్ జల్ (పవిత్ర జలం), ప్రసాదాలు పంపిణీ చేస్తున్నామని, శ్రీ శ్యామ్ సంకీర్తన, దీనితోపాటు ప్రతిరోజూ ఆలయ ప్రాంగణంలో ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తుల అన్ని రకాల కోరికలను తీరుస్తున్న బాబా శ్యామ్ కు అత్యంత ఇష్టమైన ఫాల్గుణ మాసంలో శ్రీ శ్యామ్ మందిర్ సేవా సమితి ద్వారా బాబా శ్యామ్ శోభ రథయాత్ర, జెండాల ఊరేగింపును ఫిబ్రవరి 8న ఉదయం చార్మినార్ మహాదేవ్ ఆలయం నుండి ప్రారంభమై,అఫ్జల్ గంజ్,గౌలిగూడ, చాదర్ ఘాట్, నింబోలి అడ్డా మీదుగా కాచి గూడలోని వీరన్నగుట్ట శ్రీ శ్యామ్ మందిర్ కు చేరుకుంటుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు ప్రత్యేక ప్రాముఖ్యత ఉన్న జెండా (నిషాన్) లతో పాల్గొని రథయాత్ర అనంతరం ఆలయంలో జెండాలను సమర్పిస్తారని అన్నారు. ఈ రథయాత్రలో ముఖ్యంగా ప్రముఖ గాయకుడు కన్నయ్యా మిట్టల్ తన భక్తి పాటలోతో భక్తులను మైమరపించనున్నట్టు వివరించారు. అత్యంత వైభవోపేతంగా జరిగే ఈ రథయాత్రకు వేలాది మంది భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ లు రామ్‌దేవ్ అగర్వాల్, పురుషోత్తం దాస్ గోయల్,శ్రీ శ్యామ్ మందిర్ సేవా సమితి అధ్యక్షులు చంద్రకాంత్ డకోటియా, ఉపాధ్యక్షులు కృష్ణ కుమార్ బడేగావ్‌వాలే, కార్యదర్శి ఇంద్రకరణ్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శులు రామ్‌దేవ్ అగర్వాల్, రాజ్‌కుమార్ విగ్, కోశాధికారి కపిల్ అగర్వాల్, కన్వీనర్‌లు అమిత్ అగర్వాల్, రాంనిరంజన్ అగర్వాల్,సంతోష్ అగర్వాల్,నర్సింగ్ జైస్వాల్,జీవన్ భాటి,అభిషేక్ శర్మ,సుశీల్ అగర్వాల్,గోవింద్ పొద్దార్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా గద్దర్ ఫిలిం అవార్డుల ఫంక్షన్ నిర్వహిస్తాం

**గద్దర్ ఆలోచనలను ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుంది**

**ప్రపంచ ఫిల్మ్ ఇండస్ట్రీ హబ్ గా హైదరాబాద్**

**సినిమా స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించిన భట్టి**



హైదరాబాద్,**ఫిబ్రవరి 6,ప్రజావినికిడి ,**
వచ్చే ఉగాది రోజున గద్దర్ ఫిలిం అవార్డుల ఫంక్షన్ కార్యక్రమాన్ని న భూతో న భవిష్యత్తు అన్న విధంగా ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ నిర్వహించాలని ప్రపంచ ఫిలిం ఇండస్ట్రీ మొత్తం హైదరాబాద్ వైపు తిరిగి చూసేలా ఆ కార్యక్రమాన్ని నిర్వహించాలని అందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా అందిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం సాయంత్రం ప్రసాద్ లాబ్స్ లో గద్దర్ ఫిలిం అవార్డుల సందర్భంగా సినిమాల స్క్రీనింగ్ ప్రక్రియ కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక మార్పు కోసం కలలను ఉపయోగించి, ప్రజల కోసం తన జీవితాన్ని ధారపోసిన మహానుభావుడు గద్దర్ అని ఆయన సేవలను డిప్యూటీ సీఎం కొనియాడారు. అందుకే ప్రజా ప్రభుత్వం ఆయన పేరిట సినిమా అవార్డులను ప్రారంభించింది ఇది రెండవ సంవత్సరం అని వివరించారు. వచ్చే ఉగాది పర్వదినం రోజు ఘనంగా గద్దర్ ఫిలిం అవార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ద్దర్ చివరి రోజుల్లో వారితో తాను ఎక్కువ కాలం గడిపానని, వారి స్టూడియోలో అనేక ప్రయోగాత్మక పాటలు పాడారని, చివరి రోజుల్లో గద్దర్ రికార్డింగ్ స్టూడియోలో ఎక్కువ రోజులు గడిపారని డిప్యూటీ సీఎం గుర్తు చేసుకున్నారు. తెలుగు సినీ పరిశ్రమలోని అన్ని విభాగాలకు అవార్డులను ఇవ్వబోతున్నట్లు తెలిపారు. హైదరాబాద్ కేవలం తెలుగు ఇండస్ట్రీకే కాదు భారతదేశంలోని వివిధ భాషలకు హైదరాబాద్ కేంద్రంగా మారాలని ప్రజా ప్రభుత్వం గొప్ప సంకల్పంతో పనిచేస్తుందని తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో ఉండే వాతావరణ పరిస్థితులు, నిపుణులు, శాంతి భద్రతలు దేశంలోని మరే ఇతర నగరాల్లో లేవని తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో ఉన్న సానుకూల వాతావరణాన్ని ఉపయోగించుకొని హైదరాబాదును ప్రపంచ సినీ కేంద్రంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక బ్లూ ప్రింట్ తయారు చేసుకుని ముందుకు పోతుందని తెలిపారు. సినిమాల ద్వారా సామాజిక సందేశం ఇవ్వడంతో పాటు ఆర్థిక వనరులు సమకూరే అవకాశం ఉంటుందని తెలిపారు. ÷లుగు సినిమా ఇండస్ట్రీ ఆస్కార్ వంటి ప్రపంచ స్థాయి అవార్డులను సాధించడం గర్వించదగిన అంశం అటువంటి అంశాలను పునాదిగా చేసుకుని హైదరాబాదును ప్రపంచ సినీ కేంద్రంగా మార్చాలని ఆలోచనల తో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని తెలిపారు. సినిమా పరిశ్రమకు అవసరమైన ఆర్థిక, సామాజిక, శాంతిభద్రతలపరంగా ఇంకా ఎటువంటి అవసరం అయినా అర్ధరాత్రి తమ ప్రజా ప్రభుత్వం తలుపు తట్టవచ్చని మీకోసం సీఎం రేవంత్ రెడ్డి సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తోపాటు తాను అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు, శాఖ మంత్రి వెంకట్ రెడ్డి గారు అందుబాటులో లేరు మీ అందరిని ప్రోత్సహించాలనేది మా అందరి ఏకైక లక్ష్యం అనే సందేశాన్ని మీ అందరికీ తెలియజేయవలసిందిగా తనకు తెలిపారని డిప్యూటీ సీఎం వివరించారు.

## సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ ఫేస్ 1 కాలనీలో 7.12 లక్షల రూపాయలతో భూగర్భ డ్రైనేజీ 19.50 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం..

### కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**శుక్రవారం రోజు బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ ఫేస్1కాలనీలో 7.12 లక్షల రూపాయలతో భూగర్భ డ్రైనేజ్ పనులు 19.50 లక్షల రూపాయలతో నిర్మాణం చేపట్టిన సి.సి రోడ్లును బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో 7.12 లక్షల రూపాయలతో భూగర్భ డ్రైనేజ్ మరియు 19.50 లక్షల రూపాయలతో సిసి రోడ్డు నిర్మాణం చేయడం జరుగుతుందని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కృష్ణారెడ్డి చీమర్ల,ఆర్ వెంకట్రాంరెడ్డి ప్రధాన కార్యదర్శి ,కల్లు విష్ణు వర్ధన్ రెడ్డి ఐతంమ్,రాజు రమేష్ యల్.ఐ.సి మార్కెటీంగు ఫీల్డ్ ఇన్చార్జి సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ జీ.కుమార స్వామి అడ్వైజర్ బి.ఆంజనేయులు ఉపాధ్యక్షులు,జే.శ్రనివాసు రావు మాజీ కాలనీ ప్రధాన కార్యదర్శి టి.అంజల్ రెడ్డి ఇ సి మెంబర్,యం. ఎలబోని రజనీ సింగ్,జీ.రాజేశ్వర్ కోశాధికారి జి.శ్యామ్ సుందర్ రావు ఈ.సి మెంబర్ అంజల్ రావు,యల్.భూపాల్ రెడ్డి,సి.నర సింహ్మా రెడ్డి కే.శ్రీనివాస్ రెడ్డి,యం.శ్రీనివాసు రావు వంగూరు,యం.కోటయ్య ,వి.యస్.ఆర్.ఎ శర్మ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు పవన్ రెడ్డి, నాయకుల కిషోర్ కుమార్,బిజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్ కాలనీ వాసులు వయోవృద్ధులు సీనియర్ సిటిజన్స్ కాలనీ వెల్ఫేర్ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

## ప్రమోషన్ల పై వినతి పత్రం ఇచ్చిన ఎస్ ఎం.హుస్సేనీ



**ప్రజావినికిడి, (నాంపల్లి):** టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ ఎం హుస్సేనీ (ముజీబ్),రాజీవ్ హనుమంతు ఐఏఎస్ కమిషనర్ & ఇన్స్పెక్టర్ జనరల్ రిజిస్ట్రేషన్ & స్టాంప్స్ డిపార్ట్మెంట్ ను కలిశారు. అన్ని కేడర్లలో ముఖ్యంగా గ్రేట్ 2 సీనియర్లకు ప్రమోషన్లకు సంబంధించి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అన్ని ఖాళీలను త్వరగా భర్తీ చేయాలని, అవుట్సోర్సింగ్, రెగ్యులర్ ఉద్యోగుల బదిలీలను త్వరితగతిన నిర్వహించాలని ఐజీని కోరారు. పై అంశాలపై ఐజీ సానుకూలంగా స్పందించారు. త్వరిత గతిన చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకట్, హైదరాబాద్ సిటీ అధ్యక్షులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

## జిల్లా ప్యానెల్ ఇన్స్పెక్షన్ టీం మెంబర్ గా జయేందర్



**ప్రజావినికిడి,(వాజేడు):ఫిబ్రవరి, 6,**ఎంపిపిఎస్ పుసూరు పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు బోదే బోయిన జయేందర్ రావు జిల్లా స్థాయి ప్యానెల్ ఇన్స్పెక్షన్ టీమ్ మెంబర్‌గా ఎంపిక కావడం పాఠశాలకే కాక మండలానికి గర్వకారణం. ఈ సందర్భంగా మండల విద్యా అధికారి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల సమక్షంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల విద్యా అధికారి మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో ఎంపిక కావడం ఉపాధ్యాయుని ప్రతిభ,కృషి నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల అభివృద్ధికి మరింత కృషి చేయాలని అభినందనలు తెలిపారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, ఈ విజయంతో పాఠశాల ప్రతిష్ఠ మరింత పెరిగిందని,ఇతర ఉపాధ్యాయులకు ఇది ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

## తెలంగాణ గ్రామీణ బ్యాంకు కార్యకలాపాల పై కళజాత

### తెలంగాణ గ్రామీణ బ్యాంకు వాజేడు



**ప్రజావినికిడి,(వాజేడు):ఫిబ్రవరి 7,**వాజేడు మండల పరిధిలోని,వాజేడు,పుసూరు, గుమ్మడిదొడ్డి గ్రామాలలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో కళజాత కళాకారులచేత బ్యాంకు లావాదేవులు, పొదుపు, ఇన్సూరెన్స్ ,లోన్ తీసుకొనుట సైబర్ నేరాలు,పిల్లల భవిష్యత్ సేవింగ్ ఖాతాల గురించి అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మాట్లాడుతూ, గ్రామం లో ఏర్పాటు చేయబడ్డ బ్యాంక్ మిత్ర కేంద్రాలలో బ్యాంక్ లో జరిగే అన్ని లావాదేవీలు అందుబాటులో ఉంటాయి అందరూ ఇన్సూరెన్స్, పొదుపు,సేవింగ్ అకౌంట్ అన్ని సదుపాయాలు వినియోగించుకోగలరని తెలిజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు,వాజేడు తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ ధీరజ్, సి.ఎస్.పి నాగబాబు, సర్పంచ్ భారత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఒప్పో రెనో 15 సి ఏఐ ఫీచర్లతో మార్కెట్లోకి విడుదల..



**ప్రజావినికిడి, (హైదరాబాద్):** ఒప్పో ఇండియా రెనో 15 సిరీస్‌ను కొత్త రెనో 15 సితో విస్తరించింది. మరింత మంది వినియోగదారులకు రెనో అనుభవాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి రూపొందించిన ఈ స్మార్ట్‌ఫోన్ ఫిబ్రవరి 5 నుంచి ఆఫ్టర్‌గ్లో పింక్,ట్విలైట్ బ్లూ రంగుల్లో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మెయిన్‌లైన్ రిటైల్ అవుట్‌లెట్‌లు, ఒప్పో ఈ-స్టోర్‌లో అందుబాటులో ఉంది.7000 ఏంఏహెచ్ బ్యాటరీతో 80 డబ్ల్యూ సూపర్ ఫాస్ట్ ఛార్జింగ్, 6.57-అంగుళాల డిస్ప్లే, 6 జెన్ 1 ప్రాసెసర్,ఐ పి 66,68,69 రక్షణతో పనితీరు, మన్నికను కలిపి అందిస్తుంది.
50 ఎంపీ ట్రిపుల్ కెమెరా సెటప్,50 ఎంపీ సెల్ఫీ కెమెరా,4కె వీడియో సపోర్ట్ ఏఐ ఎడిటింగ్ టూల్స్ సృజనాత్మక కంటెంట్ తయారీకి సహకరిస్తాయనీ, స్మార్ట్ ఫీచర్లు వినియోగదారులకు మెరుగైన అనుభవాన్ని అందిస్తాయి.రెనో 15 సి ధర 8జీబీ 256 జీబి వేరియంట్‌కు రూ.34,999,12 జీబీప్లస్ 256 జీబి వేరియంట్‌కు రూ.37,999గా ఉందనీ బ్యాంక్ క్యాష్‌బ్యాక్, నో-కాస్ట్ ఈ ఏ ఐ ఎక్స్ఛేంజ్ ఆఫర్లు అందుబాటులో ఉన్నాయనీ పేర్కొంది.

# గ్రామాభివృద్ధి చీపురు కట్ట పార్టీ తోటే సాధ్యం

### హేమ సుదర్శన్ జిల్లోజు



**ప్రజావినికిడి, (సంగారెడ్డి):** గ్రామాభివృద్ధి జరగాలంటే చీపురు కట్ట పార్టీ తోటే సాధ్యం అని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ హేమ సుదర్శన్ జిల్లాజు అన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో మాట్లాడుతూ,గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వంలోనూ నేడు పరిపాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ గ్రామాలను ఎలాంటి అభివృద్ధి చేయడం లేదని వాపోయారు.గత ఐదేళ్ల నుండి వార్డు మెంబర్ గా ఉండి ఎటువంటి అభివృద్ధి చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రానికి నిధులు ఉన్నా కూడా పనిచేస్త లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా పరిపాలిస్తుందో ప్రజలు గమనించాలని అన్నారు.మంజీర ప్రాజెక్టు సంగారెడ్డి నుండి హైదరాబాదుకు పోయినా కూడా సంగారెడ్డిలోని గ్రామాలలో ఇంటింటికి నీటి కొదవ ఉండడం సరికాదన్నారు. నీతి నిజాయితీతో ఢిల్లీని పరిపాలించిన ఆమ్ ఆద్మీ పార్టీ 11వ వార్డు అభ్యర్థి పల్లె ప్రేమ్ చంద్ ను గెలిపించాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ హేమ సుదర్శన్ జిల్లాజు అభ్యర్థించారు.ఈ సందర్భంగా ఉమారాన్ని ఆధ్వర్యంలో 11వ వార్డులో ఇంటింటా ప్రచారం చేశారు.

# మార్చిలో ప్రారంభానికి సిద్ధమైన సనత్‌నగర్ ఆస్పత్రి

### మంత్రి ఆదేశాలతో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పరిశీలన

### ఫిబ్రవరి 28లోగా అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశం

హైదరాబాద్,ఎ**ఫిబ్రవరి 6,ప్రజావినికిడి ,** సనత్‌నగర్ తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ను మార్చిలో ప్రారంభించేందుకు చేపట్టిన ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. రోడ్లు / భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శుక్రవారం ఆసుపత్రి ప్రాంగణాన్ని విస్తృతంగా పరిశీలించారు. ఇంజనీరింగ్ ప్రతినిధులతో కలిసి అన్ని అంతస్తులలో కొనసాగుతున్న పనులను సమీక్షించారు. ఎమర్జెన్సీ విభాగం, ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూలు, సెంట్రల్ స్టెరైల్ సర్వీసెస్ విభాగం సిద్ధతను ప్రత్యేకంగా పరిశీలించారు. ఫిబ్రవరి 28లోగా మిగిలిన అన్ని సివిల్, మౌలిక వసతుల పనులను పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆసుపత్రి అంతటా సైన్‌బోర్డులు వంటి సహాయక వసతులను ఈ నెలాఖరులోగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఈపీసీ పరిధిలోని వైద్య పరికరాలన్నీ ఇప్పటికే అమర్చినట్లు కాంట్రాక్టర్ వెల్లడించగా, మొత్తం 540 వైద్య మరియు అనుబంధ పరికరాల కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఆసుపత్రి కార్యకలాపాల ప్రారంభానికి ముందుగా పరికరాల పరీక్షలు, ట్రయల్ రన్స్ నిర్వహించేందుకు వైద్య, సాంకేతిక సిబ్బందిని వెంటనే నియమించాలని వైద్య విద్యా డైరెక్టర్‌ను ఆదేశించారు. ఫిబ్రవరి 12 నుంచి 28 మధ్య తొలి దశలో 100 మంది వైద్య, పారా వైద్య మరియు హౌస్‌కీపింగ్ సిబ్బందిని విధుల్లోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. నెలాఖరుకు పూర్తి సిబ్బంది నియామకం పూర్తవుతుందని వెల్లడించారు.మార్చిలో సనత్‌నగర్ ప్రజలకు అందుబాటులోకి రానుండటంతో, హైదరాబాద్ నగరానికి మరో కీలక ప్రభుత్వ వైద్య సంస్థగా ఇది నిలవనుందని అధికారులు తెలిపారు.

# వాట్సాప్ మీ సేవకు ఆదరణ

### 3.25 లక్షల మందికి డిజిటల్ పౌర సేవలు

హైదరాబాద్,**ఫిబ్రవరి 6,ప్రజావినికిడి ,** తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన వాట్సాప్ మీ సేవ విధానానికి అత్యధిక ప్రజాదరణ లభించిందని సర్కార్ శుక్రవారం వెల్లడించింది. దీంతో ఇప్పటివరకూ 3.25 లక్షల మందికి డిజిటల్ పౌర సేవలు అందినట్లు వివరించింది. ఈ వాట్సాప్‌లో 4.5 లక్షల మంది నమోదు చేసుకోగా.. 3.25 లక్షల మంది ఈ సేవలు పొందినట్లు గణాంకాలతో సహా విశదీకరించింది. కాగా, 24 గంటలపాటు 8096958096 వాట్సాప్ నంబర్ ద్వారా సేవలు అందిస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. పది కంటే ఎక్కువ శాఖలకు చెందిన 581 రకాల సేవలను ఈ వాట్సాప్ నెంబర్ ద్వారా అందుబాటులో తీసుకువచ్చింది. క్యాస్ట్, ఆదాయం, బర్త్, డెత్ సర్టిఫికెట్ల కోసం ఈ వాట్సాప్ నెంబర్‌ను అత్యధికంగా వినియోగించినట్లు గుర్తించింది. మీ సేవా స్టేటస్, సర్టిఫికేట్ డౌన్‌లోడ్ అన్నీ వాట్సాప్‌లోనే పొందవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. పదే పదే మీ సేవా కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా వాట్సాప్ ద్వారా ఈ సేవలు అందిస్తోందని వివరించింది. 2025 నవంబర్ 18వ తేదీన ఈ సేవలను తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు ప్రారంభించారు. డిజిటల్ అవగాహన లేని వారికీ సులభంగా ఈ సేవలు అందిస్తోంది. అలాగే ఈ వాట్సాప్ మీ సేవ ద్వారా 31 దేవాలయ సేవలు అందుబాటులోకి వచ్చాయి. దేవుని దర్శనం, వసతితోపాటు సేవలన్నీ ఈ వాట్సాప్‌లోనే బుకింగ్ చేసుకునే అవకాశాన్ని ఈ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇక రానున్న రోజుల్లో 108, 101, 102 ఎమ్జర్గ÷న్సీ సేవలను సైతం ఈ వాట్సాప్ నెంబర్‌కు అనుసంధానం చేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా 5వేలకు పైగా ఉన్న మీ సేవా కేంద్రాల్లో రోజుకు 80 వేల నుంచి లక్ష మంది వరకూ సేవలు పొందుతున్నారు.

# కెసిఆర్ కు చిప్పకూడు ఎందుకు తినిపించడం లేదు..?

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు..

**అల్లుడు కూతురు మాట్లాడుకుంటే కూడా విన్న దుర్మార్గుడు కేసీఆర్..**

**రాష్ట్ర మంత్రులు దోపిడీకి పాల్పడుతున్నారు**

**తెలంగాణను రియల్ ఎస్టేట్ కంపెనీగా మార్చారు**

**ప్రగతి నిధులు మావి.. పేరు పెత్తనం మీవా..**

**కాంగ్రెస్, బీఆర్ఎస్ లపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ధ్వజం..**

**12 ఏళ్లుగా మోదీ ఇచ్చిన నిధులతోనే పనులు..**

**కాంగ్రెస్ మంత్రులు దోచుకొని దాచుకుంటున్నారు..**

**బిజెపితోనే ప్రగతి సాధ్యం..**

**మున్సిపల్ ఎన్నికల్లో మా అభ్యర్థులను గెలిపించండి..**

**ఓటర్లకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విజ్ఞప్తి**



**ప్రజావినికిడి ,(షాద్ నగర్):**
పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనైనా.. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలోనైనా రాష్ట్రాల అభివృద్ధికి ఇచ్చిన నిధులు కేంద్రాన్ని.. పేరు పెత్తనం మాత్రం అప్పుడు బీఆర్ఎస్ ది.. ఇప్పుడు కాంగ్రెస్ ది.. వీళ్లకు దోచుకోవడం, దాచుకోవడం తప్ప మరి ఏది చేతకాదు.అంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కాంగ్రెస్, బీఆర్ఎస్ లపై ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణానికి వచ్చిన ఆయన బహిరంగ సభలో మాట్లాడుతూ, పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దోచుకున్న కెసిఆర్ పాలన అంతమైందని, కానీ దురదృష్టవశాత్తు తెలంగాణలో కాంగ్రెస్ పాలన మొదలైందని అన్నారు. ఇన్నేళ్లలో తెలంగాణ వెనుకబాటుకు, తెలంగాణకు జరిగిన అన్యాయానికి ప్రధాన కారణం కాంగ్రెస్ పార్టీయేనని విమర్శించారు. దేశానికి పట్టిన పీడ కాంగ్రెస్ అని ధ్వజమెత్తారు. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా దేశాన్ని,రాష్ట్రాన్ని పాలించి వివాదాలను సృష్టించిందని ఆరోపించారు.ఈ ఎన్నికలు కేవలం మున్సిపాలిటీ ఎన్నికలు మాత్రమే కావని,ఇది తెలంగాణ భవిష్యత్తు అని పేర్కొన్నారు. తెలంగాణను ఎంతో అభివృద్ధి చేశామంటూ ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెస్,బీఆర్ఎస్ లు లోకల్ బాడీలకు నిధులు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని ప్రశ్నించారు.షాద్ నగర్ ప్రాంతం గ్రేటర్ హైదరాబాద్ తరహాలో మారాలంటే భారతీయ జనతా పార్టీని గెలిపించాలని కోరారు.కాంగ్రెస్ పార్టీలో మంత్రులు ఊళ్లను,శాఖలను పంచుకొని ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.బడ్జెట్లో తెలంగాణకు ఏమీ చేయలేదని కాంగ్రెస్ విమర్శిస్తుందని, హై స్పీడ్ రైల్ ఎలివేటర్ కారిడార్ 300 కోట్ల రూపాయలతో తెలంగాణకు వస్తుందని గుర్తు చేశారు. ఒక్క మహబూబ్నగర్ జిల్లాలోనే అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 50 వేల కోట్లు ఖర్చు పెడుతుందని, అందులో షాద్ నగర్ కు కూడా భాగస్వామ్యం ఉందని అన్నారు. తెలంగాణలో జాతీయ రహదారులను విస్తరించి అత్యద్భుతమైన రవాణా ప్రగతి తీసుకొచ్చిన ఘనత కేంద్ర ప్రభుత్వాన్ని దేనని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

### సంచలన కామెంట్స్

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు రాష్ట్ర మంత్రులు ఊర్లు పంచుకుని దోపిడీకి పాల్పడుతున్నారని కెసిఆర్ కు చిప్పకూడు తినిపిస్తా అని పదేపదే అన్న రేవంత్ రెడ్డి రెండున్న సంవత్సరాలుగా ఏమీ అనకుండా ఉండడానికి కారణం ఢిల్లీ స్థాయిలో రెండు పార్టీల మధ్య ఒప్పందం కుదరడమేనని కిషన్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ టిఆర్ఎస్ తోడు దొంగలని అన్నారు. తెలంగాణను రక్షించాలంటే బిజెపిని గెలిపించాలని పిలుపునిచ్చారు. తెలంగాణకు మూడున్నర లక్షల కోట్లతో హై స్పీడ్ రైలు వెలివేటారు కారిడార్ రాబోతుందని అన్నారు. పాలమూరు జిల్లాకు 50 వేల కోట్ల రూపాయల రైల్వే మీద కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఖర్చు పెట్టబోతుందని వివరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని రియల్ ఎస్టేట్ కంపెనీగా మార్చిన రేవంత్ రెడ్డి అంటూ వాగ్బాణాలు సంధించారు. రాష్ట్రంలో రిటైర్డ్ అయిన ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇవ్వకుండా రెండున్నర సంవత్సరాలుగా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడే భాష మార్చుకోవాలని ఉద్యోగులకు సంబంధించిన ఐదు డిఏలు పెండింగ్లో ఉన్నాయని దోచుకోవడం దాచుకోవడం కాంగ్రెస్ పార్టీ అజెండా అని టిఆర్ఎస్ కారుకు ఉన్న నాలుగు టైర్లకు నలుగురు తీసుకొని తిరుగుతున్నారని అల్లుడు కూతురు మాట్లాడుకుంటే కూడా ఆ మాటలు చాటుగా విన్న దుర్మార్గుడు కేసీఆర్ అంటూ అనేక సంచలన వ్యాఖ్యలు చేశారు. బిజెపి నేతలు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి,అందే బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, కక్కునూరు వెంకటేష్ గుప్తా, డాక్టర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



# వెంకిర్యాల వంతెనకు నిధులు రెడీ..

**వంతెన పునరుద్ధరణకు రూ.3.50 కోట్లు మంజూరు చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.. - రోడ్డు విస్తరణకు మరో కోటి రూపాయలు..**

**కొంతవరకు కస్తూర్బా పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.1.58 కోట్లు.. - అభివృద్ధి ఆయుధంగా ముందడుగు: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**





**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
అభివృద్ధి ఆయుధంగా ముందడుగు వేస్తూ నిరంతరం ప్రజల కోసం పనిచేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొందర్గుకు మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శుక్రవారం అయిన శంకుస్థాపన చేశారు.కోటి 58 లక్షలతో ఈ కాంపౌండ్ వాల్ ను నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా వెంకిర్యాల బ్రిడ్జి పునరుద్ధరణ కోసం రూ.3.50 కోట్లు నాన్ ప్లాన్ నిధుల ద్వారా మంజూరైనట్లు వెల్లడించారు.దీని పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.ఇక రహదారి విస్తరణ నిమిత్తం కూడా రూ. కోటి మంజూరైనట్లు ఆయన వెల్లడించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యాలయాల అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ద్వారానే నిజమైన ప్రగతికాంతులు కనిపిస్తాయని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిధుల కొరత లేదని ఎలాంటి సమస్యలు తన దృష్టికి వచ్చిన వెంటనే నిధులు సేకరించి ఆ పనులను పూర్తి చేస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు సంక్షేమ కార్యక్రమాలతో అన్ని వర్గాలను ఆదుకోవడమే కాకుండా, సమస్యలను పరిష్కరించే దిశగా పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తుందని ఆయన అన్నారు.నాటి నుంచి నేటిదాకా అభివృద్ధి పథంలో ముందుకు సాగి గ్రామాలను, పట్టణాలను ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత కాంగ్రెస్ పార్టీకి మాత్రమే సొంతమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# న్యాయవాదులపై హత్యాకాండలను అరికట్టండి..

**డిజిపి పి. శశిధర్ రెడ్డికి షాద్ నగర్ బార్ అసోసియేషన్ నేతల ఫిర్యాదు..**

**రక్షణ కల్పిస్తామని డిజిపి హామీ**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
న్యాయవాదులపై హత్యాకాండలను, దాడులను అరికట్టాలని కోరుతూ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర డిజిపి పి.శశిధర్ రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందించారు.షాద్ నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాలరావు, ప్రధాన కార్యదర్శి గుండుబావి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక న్యాయవాదులు కూడా ఆయనను కలుసుకున్నారు. ఇటీవల మహిళా న్యాయవాది స్వప్నను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని న్యాయవాదులు ఆయనను కోరారు. రాష్ట్రంలో న్యాయవాదులపై జరుగుతున్న హత్యాకాండలను, దాడులను అరికట్టే విధంగా పోలీసు శాఖకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అంతేకాకుండా న్యాయవాదుల రక్షణ కోసం అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్, అదేవిధంగా హెల్త్ కార్డుల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా న్యాయవాదులు త్వరలో భూతప్పూర్ నుంచి సెక్రటేరియట్ వరకు పాదయాత్ర చేయనున్నట్లు వెల్లడించారు.ఈ పాదయాత్రకు కూడా రక్షణ కల్పించాలని డిజిపికి కోరారు. దీనిపై డిజిపి స్పందిస్తూ ఇలాంటివి మళ్లీ పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. తెలంగాణ ఫెడరేషన్ అధ్యక్షుడు అనంతరెడ్డి తో పాటు,షాద్ నగర్ అధ్యక్షుడు వేణుగోపాలరావు, మల్కాజిగిరి అధ్యక్షుడు అమరేందర్ రెడ్డి, అలంపూర్ అధ్యక్షుడు శ్రీనివాస్,షాద్ నగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాస్ రెడ్డి తదితరులు వినతి పత్రం అందించిన వారిలో ఉన్నారు.

# ఎం-ప్యానల్ లేకుండా అక్రిడేషన్ నోటిఫికేషనా.?

**జర్నలిస్టులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు ఈ చిన్నచూపు.?**

**అర్హత ఉన్న అన్ని పత్రికలను వెంటనే ఎంపానల్ చేయాలి..**

**నిజమైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డ్ ఇవ్వకుంటే ఉద్యమిస్తాం: టీజేఎస్ఎస్..**

**పెద్ద పత్రికలకు ఒక్కరోజు ఇచ్చే అడ్వటైజ్మెంట్లతో వందల్లో చిన్న పత్రికలు బాగుపడతాయి..**

**రిపోర్టర్ల పై సమాచార శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి కక్ష కట్టారా..?**

**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
రాష్ట్రంలో అర్హత ఉన్న పత్రికలను ఎం-ప్యానల్ చేయకుండానే అక్రిడేషన్‌కు అప్లై చేసుకోవాలని నోటిఫికేషన్ ఇవ్వడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇది కేవలం పరిపాలనా నిర్ణయమా.?
లేదా చిన్న పత్రికలు,నిజమైన రిపోర్టర్లను పక్కన పెట్టే కుట్రానా.? అనే ప్రశ్నలు తీవ్రంగా వినిపిస్తున్నాయని జర్నలిస్టు సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.
ఎన్నికల ముందు మీడియా, ముఖ్యంగా చిన్న పత్రికలు, ఫీల్డ్ రిపోర్టర్లు కాంగ్రెస్‌కు అండగా నిలిచారు. ప్రజా సమస్యలను ముందుకు తీసుకెళ్లారు. టిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. అలాంటి జర్నలిస్టులే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనగదొక్కబడుతున్నారా.? అంటే కాంగ్రెస్ ప్రభుత్వం రిపోర్టర్లను పూర్తిగా పక్కన పెట్టేయడం జరుగుతుందన్నారు.

## ఎం-ప్యానల్ లేకుండా అక్రిడేషన్ అంటే ఎవరికీ లాభం.?

ఎం-ప్యానల్ అనేది కేవలం ఒక అధికారిక ప్రక్రియ కాదు.పత్రిక నిజమైనదా.? క్రమం తప్పకుండా ప్రచురణ జరుగుతుందా.?
ఫీల్డ్‌లో పని చేసే రిపోర్టర్లు ఉన్నారా.? ప్రజా సమస్యలపై కథనాలు వస్తున్నాయా.? ఈ విషయాలన్నిటిని డిపిఆర్వోలు ఐ అండ్ పి ఆర్ పర్యవేక్షించాలి. కానీ వాళ్ళ పర్యవేక్షణ ఎక్కడ.?
జిల్లా డిపిఆర్ఓ ల వద్ద జిల్లాలో పనిచేసే రిపోర్టర్ల సమాచారం ఉందా.? ఎం పానెల్ చేయకుండా అక్రిడేషన్ ఇస్తే పేపర్ మీద మాత్రమే ఉన్న పత్రికలు, అధికార పార్టీకి అనుకూలంగా పనిచేసే బినామీ మీడియా సంస్థలకే దారితీయదా.?
దీని వల్ల నిజంగా రోడ్డెక్కి వార్తలు తెచ్చే గ్రౌండ్ రిపోర్టర్లు తీవ్రంగా నష్టపోతారు.ఈ విషయం సమాచార శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి ఎందుకు గుర్తించడం లేదు.

### చిన్న పత్రికలు అంటే సీఎం రేవంత్ రెడ్డికి గిట్టదా.?

గత కెసిఆర్ ప్రభుత్వంలో చిన్న పత్రికలకు తీవ్ర అన్యాయం జరిగిందని ప్రతిపక్షంలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలుమార్లు మీడియా ముఖంగా ప్రశ్నించారు. ప్రస్తుతం రేవంత్ సర్కార్ అధికారంలో ఉంది మరి చిన్న పత్రికలకు మీడియాకు ఎందుకు అన్యాయం చేస్తున్నారు.
ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన మాటలు అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరిచిపోయారా.? పెద్ద పత్రికలకు ఒక్కరోజు ఇచ్చే అడ్వటైజ్మెంట్ ఖర్చులలో దాదాపు చిన్న పత్రికలు అన్ని బతికి బట్ట కడతాయి.ఈ విషయాన్ని ముఖ్యమంత్రి ఎందుకు అర్థం చేసుకోవడం లేదు అధికారంలోనికి రావడానికి చిన్న పత్రికల సహాయం కావాలి వచ్చిన తర్వాత తొక్కి వేయాలి ఇదేనా.?
ఈ నిర్ణయంతో ఒక ప్రశ్న స్పష్టంగా వినిపిస్తోంది,
“చిన్న పత్రికలు అంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గిట్టదు అని”పెద్ద పత్రికలకు కోట్ల రూపాయల ప్రకటనలు,
చిన్న పత్రికలకు మాత్రం ఎంపానెల్ లేదు.భరోసా లేదు.గుర్తింపు లేదు,ఇదేనా ప్రజా పాలన.?
ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వం మీడియాకు ఇచ్చిన గౌరవం.?
జర్నలిస్టులతోనే అధికారంలోకి వచ్చి,
మీడియా స్వేచ్ఛ గురించి మాట్లాడిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఈరోజు అదే మీడియాను నియంత్రించే ప్రయత్నం చేస్తోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### నచ్చినవారికి అక్రిడేషన్, ప్రశ్నించేవారికి నిరాకరణ..

జర్నలిస్టుల విషయంలో సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిర్ణయాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతం కాదా.? మొదటగా అర్హత ఉన్న చిన్న పత్రికలకు ఏం ప్యానల్ చేయాలని
ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్న పట్టించుకోకపోవడం బాధాకరంగా మారింది.
కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ముందుగా అర్హత ఉన్న పత్రికలను వెంటనే ఎం-ప్యానల్ చేయాలి.
ఆ తర్వాతే అక్రిడేషన్ ప్రక్రియ చేపట్టాలి.చిన్న పత్రికలు,నిజమైన రిపోర్టర్లకు న్యాయం చేయాలి. లేకపోతే ఇది మీడియాపై దాడిగా,స్వేచ్ఛను హరించే చర్యగా చరిత్రలో మిగిలిపోతుందని తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం పేర్కొంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టులను చిన్నచూపు చూడడం ద్వారా కాదు వారికి గౌరవం ఇవ్వడం ద్వారా మాత్రమే ప్రభుత్వం బలపడుతుందని టీజేఎస్ఎస్ సూచించింది.

# ప్రజల మాటే తీర్పు

## -7వ వార్డులో కొప్పునూరు ప్రవీణ్‌కే పట్టం

### -7 వార్డు అభ్యర్థికి మద్దతుగా ఎమ్మెల్యే ప్రచారం






**ప్రజావినికిడి,(షాద్ నగర్);**మున్సిపల్ ఎన్నికల వేళ షాద్‌నగర్ 7వ వార్డులో ఎమ్మెల్యే రాక తో రాజకీయం మారిపోయింది. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి కొప్పునూరు ప్రవీణ్ వైపే ప్రజల మొగ్గు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొనగా,కాలనీ అంతటా కాంగ్రెస్ నినాదాలు మారుమోగాయి.
ప్రజలతో ముఖాముఖి సంభాషణలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, ప్రతి ఇంటి గుమ్మం దగ్గర వినిపిస్తున్న మాట ఒక్కటే ఈసారి కాంగ్రెస్‌కే ఓటు అని తెలిపారు.గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి కనపడలేదని విమర్శించారు. కాలనీలు నిర్లక్ష్యానికి గురయ్యాయని, ప్రజలు మౌలిక వసతుల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే అభివృద్ధి బాట పట్టిందని, కొప్పునూరు ప్రవీణ్‌ను గెలిపిస్తే 7వ వార్డు రూపురేఖలే మారుస్తామని భరోసా ఇచ్చారు.అభ్యర్థి కొప్పునూరు ప్రవీణ్ మాట్లాడుతూ, హామీలు కాదు, చేసిన పనులే మా ప్రచారం అని స్పష్టం చేశారు. కోట్ల రూపాయల వ్యయంతో సీసీ రోడ్లు నిర్మించామని,అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను విస్తరించి కాలనీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించామని వివరించారు. మంచినీటి కొరతను తొలగించామని, విద్యుత్ మౌలిక వసతులను మెరుగుపరిచామని తెలిపారు.పార్కులను ఆధునికీకరించి పిల్లలు,వృద్ధులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించామని,రేషన్ షాప్, అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటు ద్వారా పేదల అవసరాలు తీర్చామని చెప్పారు.ఇప్పటికే కొత్త రోడ్లు,డ్రైనేజీ పనులకు నిధులు మంజూరై పనులు ప్రారంభ దశలో ఉన్నాయని తెలిపారు.ప్రజల ఆశీర్వాదంతో గెలుపొందితే 7వ వార్డును అభివృద్ధికి మోడల్‌గా నిలబెడతామని కొప్పునూరు ప్రవీణ్ ధీమా వ్యక్తం చేశారు.

# తీరుమారని వైనం

## - ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



**షాద్ నగర్ గిరిజన విద్యార్థులకు నాసిరకం భోజనం.**

**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
షాద్‌నగర్ ప్రభుత్వ బాలుర గిరిజన సంక్షేమ కళాశాలలో విద్యార్థుల సమస్యలు అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా మారుతున్నాయి. కొద్ది రోజుల క్రితం నూకల బియ్యంలో రాళ్లు కలిసిన నాసిరకం ఆహారం వడ్డిస్తున్నారంటూ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేయగా, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్ కళాశాల విద్యార్థులకు మద్దతుగా గళమెత్తారు.
ఆ సందర్భంలో అధికారులు స్పందించినట్లు నటించి, కేవలం నామమాత్రపు చర్యలతో సరిపెట్టారు.
అయితే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో అదే పరిస్థితి మళ్లీ పునరావృతమైంది. నాణ్యతలేని ఆహారంతో విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న



వైనంపై విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్ మాట్లాడుతూడగిరిజన సంక్షేమ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు కనీసం తినే భోజనం కూడా సక్రమంగా అందించలేని ప్రభుత్వం, అధికారుల వైఫల్యానికి ఇది నిదర్శనం.రాళ్లు కలిసిన బియ్యం, నాసిరకం ఆహారం పెట్టడం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడడమే.గతంలో ఫిర్యాదు చేస్తే కంటితుడుపు చర్యలు తీసుకుని తప్పించుకున్నారు. ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితి రావడం అధికారుల నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తోంది.వెంటనే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. నాణ్యమైన ఆహారం సరఫరా జరిగేలా పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలి.లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.
ఇప్పటినా అధికారులు స్పందించి విద్యార్థుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

# కాంగ్రెస్ పార్టీకి ఓటు షాద్ నగర్ ప్రగతికి ఓటు

### తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి కేశంపేట మండలం మాజీ జెడ్పీటిసి




**ప్రజావినికిడి,(షాద్ నగర్):**మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా షాద్ నగర్ లోని 25వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పెంటయ్యను గెలిపించాలని ఓటర్ మహాశయులను అభ్యర్థిస్తూ ముమ్మరంగా ప్రచారం నిర్వహించిన మాజీ జెడ్పీటిసి విశాల కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,వార్డు సభ్యులు.ఈ సందర్భంగా వార్డు వ్యాప్తంగా ఇంటింటి ప్రచారాన్ని కొనసాగించారు.
వార్డులోని వివిధ కాలనీల్లో పర్యటించి ప్రజలతో మమేకమై మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షానే నిలుస్తుందని,ప్రజల విశ్వాసమే తమకు అసలైన బలమని వారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రాధాన్యత ఇస్తూ దశలవారీగా పరిష్కారాలు చూపుతామన పేర్కొన్నారు.


# రాజేందర్‌నగర్ ఈవీఎం గోడౌన్ పరిశీలన




**రంగారెడ్డి ఫిబ్రవరి 6,ప్రజావినికిడి ,**
రాజేందర్‌నగర్‌లోని ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు మయంక్ మిట్టల్తో కలిసి సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్ర స్థాయి సందర్శన నిర్వహించి, ఈవీఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లు సహా ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన తీరును సవివరంగా తనిఖీ చేశారు.ఈవీఎం గోడౌన్ వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు తీరును కూడా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల భద్రతలో ఎలాంటి లోపాలు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట రాజేందర్‌నగర్ తహశీల్దార్, వేర్‌హౌస్ ఇంచార్జి రాములు, ఎన్నికల విభాగం అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# టిటిడి ఇవోగా ముద్దాడ రవిచంద్ర బాధ్యతలు

### శ్రీవారిని దర్శించుకున్నాక వేదాశీర్వచనం




తిరుమల,**ఫిబ్రవరి 6,ప్రజావినికిడి ,**)తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ ఇన్‌ఛార్జ్ ఈవోగా సీఎంవో ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం సతీసమేతంగా భూవరాహ స్వామిని దర్శించుకున్నారు. ఆ తర్వాత వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి వెళ్లిన ఆయన.. రంగనాయకుల మండపంలో ఇన్‌ఛార్జ్ ఈవోగా బాధ్యతలు స్వీకరించి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రవిచంద్ర మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవారి భక్తుడిగా ఎంతో మందికి సేవచేసే భాగ్యం దక్కిందన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వం, భక్తుల నమ్మకాన్ని నిలబెడతానని స్పష్టం చేశారు. టీటీడీ బోర్డు, అధికారులతో పాటు అందరి సలహాలు, సూచనలు తీసుకుని సమన్వయంతో ముందుకు సాగుతానన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా ఉండేలా పరిపాలన కొనసాగిస్తానని చెప్పారు. తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వివాదం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం.. టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌ను బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రికి ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ముద్దాడ రవిచంద్రకు టీటీడీ ఇన్‌ఛార్జ్ ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. సీఎంవో ముఖ్య కార్యదర్శిగా ఉంటూనే టీటీడీ ఇన్‌ఛార్జ్ ఈవో బాధ్యతలనూ రవిచంద్ర నిర్వర్తించనున్నారు .

# రేవంత్‌పై ఎన్నికల పిటిషన్

### రేవంత్ అభ్యర్ధనకు హైకోర్టు తిరస్కరణ

హైదరాబాద్,**ఫిబ్రవరి 6,ప్రజావినికిడి ,**హైకోర్టులో సీఎం రేవంత్ రెడ్డికి ఎదురుదెబ్బ తగిలింది. తనపై నమోదైన క్రిమినల్ కేసులను కొట్టివేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. 2023లో భూపాలపల్లిలో జరిగిన బహిరంగ సభలో తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు కేసులు నమోదు కాగా, వాటిని రద్దు చేయాలంటూ సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అయితే ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని పేర్కొన్న న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేస్తూ, తదుపరి విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసింది.

----

# బానిస భావజాలంలో విమర్శల జోరు !

**ఫిబ్రవరి 6,ప్రజావినికిడి ,**
గతంలో వికీ లీక్స్ కూడా ఓ ఊపు ఊపింది. విదేశాల్లో ఉన్న ఊరూపేరు లేని కొందరు పనిగట్టుకుని ప్రపంచ దేశాల్లో ఉన్నవారిపై ఊకదంపుడు, ఊహాగాన కథనాలు రాస్తుంటారు. అవన్నీ పట్టుకుని మనదేశంలో నోరు పెద్దదిచేసి అరవడం కొందరు అలవాటు చేసుకున్నారు. తాజాగా ఎప్‌స్టీన్ ఫైల్స్ పైనా దుమారం రేపుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ప్రధాని పేరు పదేపదే ప్రస్తావన కు వచ్చిందని చెబుతున్న వారు అందులో ఏముందో తెలుసుకుని మాట్లాడితే బాగుండేది. ఇదంతే ఒక ఎత్తయితే దీని కారణంగానే మోడీ అమెరికాతో ట్రేడ్ డీల్ కుదుర్చుకున్నారన్న ప్రచారం చేపట్టారు. దీంట్లో రాహుల్, లెఫ్ట్ పార్టీలు ముందున్నాయి. నిజానికి ఎప్‌స్టీన్ ఫైల్స్ లో రాహుల్ పేరు కూడా ఉంది. దానిని ఆయనగాని, ఆయనకు వంతపాడుతున్న వారు గానీ మాట్లాడడం లేదు. అందులో రాహుల్‌ను ఓ అసమర్థ నేతగా వర్ణించారు. అతను రాజకీయాలకు పనికి రాడని, అతని వల్ల ఒరిగేదేమీ లేదని తేల్చారు. దీనిని మరుగున పర్చి మాట్లాడుతున్నారు. కనీసం రాహుల్ కూడా దీనిని తెలుసుకుని మాట్లాడితే బాగుండేది. అలాగే రాహుల్ భారత రాజకీయాల గురించి ఎప్‌స్టీన్ ఎవడు కామెంట్ చేయడానికి అన్న ప్రశ్న వేసుకోవాలి. అలాగే మిగతా వారి గురించి కూడా అతను వ్యాఖ్యానించడానికి అతని తాహతు ఏంటన్నది కూడా ముఖ్యం. ఇక ట్రేడ్ డీల్ గురించి మాట్లాడుకుంటే ట్రంప్ ఏనాడూ భారత్‌కు అనుకూలంగా వ్యవహరించ లేదు. 50శాతం సుంకాలు బాది చెవి మెలిపెట్టాడు. మాట్లాడడానికి కూడా భారత్



ప్రధానితో ఇష్టపడలేదు. అనూహ్యంగా ఆయన మారడానికి, ట్రేడ్ డీల్ కుదుర్చుకోవాలని అనుకోవడానికి కారణాలు ఉన్నాయి. ఒకటి అమెరికాలో భారత్‌కు మద్దతుగా అక్కడి నేతలు ట్రంప్‌పై అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. భారత్‌తో వాణిజ్యం తెంపుకుంటే మనం మటాష్ అవుతామని అంటున్నారు. అలాగే యూరోపియన్ యూనియన్‌తో భారత్ ట్రేడ్ డీల్ కుదుర్చుకోవడంతో ట్రంప్‌కు దిక్కుతోచకుండా పోయింది. అలాంటి ట్రంప్ టారిఫ్‌లను 18శాతానికి తగ్గించి భారత్‌తో కాళ్లబేరానికి వచ్చాడు. ఇక్కడ మోడీ ఎక్కడ ట్రంప్‌కు లొంగిపోయాడో, ఎక్కడ భారత్‌ను తాకట్టు పెట్టారో కాంగ్రెస్, కమ్యూనిస్టులు చెప్పాలి. ఈ పరిస్థితిలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా డీల్ కుదుర్చు కునేదే. రాజకీయ అవగాహన లేకుండా మాట్లాడుతున్న వారికి దేశాం గురించి, ప్రపంచం గురించి తెలియదనుకోవాలి. రాహుల్ లాంటి విపక్ష నేత ఉన్నందుకు సిగ్గుపడాలి. ఎందుకంటే పార్లమెంట్‌లో గట్టిగా వాణి వినిపించలేకపోవడం, అల్లరి చేసి బయటకు రావడం మాత్రమే తెలిసిన అసమర్థుడు రాహుల్. ఇలాంటి వారి వల్లనే దేశ ప్రతిష్టకు మచ్చగా మారుతోంది. బడా కార్పొరేట్ల ప్రయోజనాల కోసం మోడీ ప్రభుత్వం ఎంతవరకైనా వెళ్తుందని ట్రేడ్ డీల్ గురించి పదేపదే చెబుతున్న వారు సిగ్గుతో తలదించుకోవాలి. నిజానికి ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో అనేకరకాలుగా అందిరి పేర్లు ఉన్నాయి. వాటికి ఆధారాలు లేవు. ఓ వికృత వ్యక్తి, వ్యభిచారి తనకు తానుగా రాసుకున్న కథలను చూపించి అంతా అక్కసు వెళ్లగక్కుతున్నారు. ముఖ్యంగా భారత విపక్షాలు ఈ విషయంలో ముందున్నారు. ఏ సందు దొరికినా మోడీని ఆడిపోసుకోవడమే పనిగా పెట్టుకున్నారు. నిజానికి పార్లమెంటులో ప్రజల సమస్యలను ప్రస్తావించి పోరాడాలన్న పట్టుదల లేని వారంతా ఎంపిలుగా ఉన్నారు. ప్రజల డబ్బును దోచేస్తున్నారు. పన్నుల రూపంలో కట్టిన డబ్బులను దుబారా చేస్తున్నారు. ఇవన్నీ మాట్లాడడానికి సమయం ఉండదు. ఇకపోతే ఎప్‌స్టీన్ లైంగిక నేరస్తుడిగా అంగీకరించి 18 నెలలపాటు జైలు శిక్షకు గురై, ప్రైవేట్ జెట్స్, ఐలాండ్స్ కొనుగోలు చేసే స్థాయికి ఎదిగిన జెఫ్రీ ఎప్‌స్టీన్ ప్రపంచ నేతలతో, కార్పొరేట్లతో సంబంధాలు నెరిపే బ్రోకర్. 2019లో రెండోసారి జైలుకు వెళ్లిన తరువాత ఆత్మహత్య చేసుకున్నాడని అమెరికా ప్రకటించింది. అయితే తమ సంబంధాలు బయటకు వస్తాయని ప్రముఖులే హత్య చేయించారన్నది అక్కడి మీడియా కథనం. జెఫ్రీ ఎప్‌స్టీన్ తనకుతాను రాసుకున్న వారి పేర్లలో మోడీ, రాహుల్, కేంద్ర మంత్రి హర్‌దీప్‌సింగ్ పురి, ముఖేష్ అంబానీ సోదరుడు అనిల్ అంబానీ పేర్లు ఉన్నాయని సమాచారం. మరి వీరందిరికి సంబంధించి అందులో ఏముందో ఎవరికీ తెలియదు. ఆ సందర్భంగా జరిపిన ఇ మెయిల్స్‌లో పదేపదే ప్రధాని పేరు ప్రస్తావనకు రావడం తదితర అంశాలపై ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సిన బాధ్యత కేంద్రానిదే అంటూ చిలకపలుకులు పలుకుతున్న వారికి రాజకీయ నిబద్దత లేదనుకోవాలి. 2014 జూన్ నుంచి 2017 మే మధ్య ఎప్‌స్టీన్‌తో అనేకసార్లు మెయిల్స్, చాట్స్ చేయడంతోపాటు మూడుసార్లు స్వయంగా కలిశారు. టెక్నాలజీ అభివృద్ధి కోసం, ఆ రంగంలో ప్రముఖులతో సంబంధాల కోసమే సంప్రదించానని, అతను నేరస్తుడని తెలీదని పురి చెబుతున్నారు. అప్పటికే ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైన క్రిమినల్ గురించి ఐఎఫ్ఎస్ మాజీ అధికారికి తెలియదనడం బుకాయింపున అంటున్నారు. అయితే అందులో బిల్‌గేట్స్, ట్రంప్, క్లింటన్, హిల్లరీ క్లింటన్ ఇలా ఎందరో ప ఏర్లు ఉన్నాయి. అప్పట్లో ఏదో సందర్భంలో అతనిని కలిసే ఉంటారు. అంతమాత్రాన అతనో సచ్ఛీలుడిగా, అతనికి పెద్ద హోదా ఆపాదించి మనలను మనం చిన్న చేసుకోవడం దారుణం. 2017 జులైలో ప్రధాని మోడీ ఇజ్రాయిల్‌లో పర్యటించడం మినహా మిగతాదంతా అబద్ధమని, ఆ నేరస్తుడి కల్పనలని పేర్కొంటూ కేంద్రం ఖండించింది. జెఫ్రీ ఎప్‌స్టీన్ ఇ మెయిల్స్‌కు సంబంధించిన అంతర్జాతీయ కథనాలపై స్పందించడం సరికాదు. ఎవరికి వారు ఏదో ఊహించుకుని ఎప్‌స్టిన్‌ను ఆకాశానికి ఎత్తడం, అతనో దేవదూతగా భావించడం దుర్మార్గం. ఒక లైంగిక వ్యభిచారి అయిన ఎప్‌స్టిన్ గురించి తెలుసుకుంటే మంచిది. ట్రంప్, బిల్ క్లింటన్ మొదలు ప్రపంచవ్యాప్తంగా అనేకమంది ప్రముఖుల చీకటి కోణాలను వెలుగులోకి వచ్చాయని అనుకోవడం కూడా అంతే పొరపాటు. ఇలాంటి కథనాలను వండివార్చే లెఫ్ట్ నేతలు దేశం గురించి ఆలోచిస్తే మంచిది. ముందుగా రాహుల్ పేరు ఎందుకు ప్రస్తావనకు వచ్చిందో నిలదీస్తే మంచిది. మోడీని నిందించాలనుకుంటే పార్లమెంటులో నిలదీయండి. అతని నిర్ణయాలను తిప్పికొట్టండి. పార్లమెంటులో మాట్లాడడం చేతకాని నేతలంతా జెఫ్రీ ఎప్‌స్టీన్ అనే ఓ వ్యభిచారి కథనాలకు ప్రాధాన్యం ఇవ్వడం, అదికూడా అతను ఈ భూమ్మీద లేడు కనక వివరాలు ఇవ్వలేడు కనుక బురదజల్లడం సరికాదు.

# మద్రాస్ హైకోర్టులో నటుడు విజయ్‌కు చుక్కెదురు

## ఆదాయపన్ను శాఖ జరిమానాపై పిటిషన్ కొట్టివేత

చెన్నై,**ఫిబ్రవరి 6,ప్రజావినికిడి ,**
మద్రాసు హైకోర్టులో నటుడు, టీవీకే అధినేత విజయ్ కు చుక్కెదురైంది. ఆదాయపన్ను శాఖ విధించిన పెనాల్టీకి వ్యతిరేకంగా హైకోర్టును ఆశ్రయించగా.. విచారించిన న్యాయస్థానం విజయ్ పిటిషన్‌ను కొట్టేసింది. 2015-16 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విజయ్ రూ. 1.50 కోట్ల జరిమానా చెల్లించాలని ఐటీ శాఖ నోటీసులు ఇచ్చింది. దీనిపై 2022లో విజయ్ హైకోర్టును ఆశ్రయించారు. గత నెలలో తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు.. ఇప్పుడు పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. 2015-16 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆదాయపన్ను రిటర్న్ దాఖలు చేసినప్పుడు ఆ ఏడాది విజయ్ రూ. 35 కోట్లు ఆదాయం పొందినట్లు ఆదాయ పన్ను శాఖ మద్రాసు హైకోర్టులో నివేదిక దాఖలు చేసింది. అందుకు సంబంధించి మదింపు చేపట్టిన ఆదాయపన్ను శాఖ విజయ్ ఇంట్లో జరిపిన సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాలను సరిచూడగా 'పులి' సినిమాకు తీసుకున్న రూ. 15 కోట్ల ఆదాయాన్ని లెక్కల్లో చూపలేదని తేలింది. ఆ ఆదాయాన్ని




దాచినందుకు రూ. 1.50 కోట్ల జరిమానా విధిస్తూ ఆదాయపన్ను శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. దీనిని సవాలు చేస్తూ విజయ్.. మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. విజయ్ నటించిన కొత్త సినిమా 'జన నాయగన్' వివాదంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. జనవరి 9న విడుదల కావాల్సిన ఈ సినిమా సెన్సార్ సమస్య కారణంగా వాయిదా పడింది. కొత్త విడుదల తేదీ ఎప్పుడనే ఉత్కంఠ ఇంకా వీడలేదు. ఈ క్రమంలో పన్ను జరిమానా కేసులో విజయ్ రిట్ పిటిషన్‌ను మద్రాస్ హై కోర్టు శుక్రవారం కొట్టివేసింది. 2015 సెప్టెంబర్ 30న ఐటి అధికారులు నిర్వహించిన సోదాలను అనుసరించి మాత్రమే నటుడు విజయ్ పన్నులు చెల్లించారని, అంతకు ముందు వచ్చిన ఆదాయానికి సంబంధించి కాదని, ఐటి శాఖ విధించిన జరిమానాను రద్దుచేయలేమని జస్టిస్ సెంథిల్ కుమార్ రామమూర్తి తీర్పునిచ్చారు. ఆదాయపన్ను చట్టం ప్రకారం నిర్దేశించిన కాల పరిమితిలోపు జరిమానా ఉత్తర్వు జారీ చేయబడిందని ఆయన తేల్చారు. 015-16 ఆర్థిక సంవత్సరంలో అదనపు ఆదాయాన్ని స్వచ్ఛందంగా వెల్లడించినందుకు ఆదాయ పన్ను శాఖ తనకు రూ. 1.50కోట్ల జరిమానా విధించడాన్ని వ్యతిరేకిస్తూ 2022లో నటుడు విజయ్ రిట్ పిటిషన్‌ను దాఖలు చేసిన సంగతి తెలిసిందే. 2015లో వచ్చిన పులి సినిమా నిర్మాతలు, ఎస్‌కెటి స్టూడియోస్‌కు చెందిన పి.టి. సెల్వకుమార్, శిబు చెక్కుల ద్వారా రూ. 16కోట్ల పారితోషకంతో పాటు రూ. 4.93 కోట్ల నగదును చెల్లించారని, చెక్కు మొత్తానికి మాత్రమే పన్ను మినహాయింపు (టిడిఎస్) జమ చేశారని, నగదు లావాదేవీకి కాదని ఐటి శాఖ పేర్కొంది.

# మిర్చిరైతులకు మంచి రోజులు

## వరుసగా పెరుగుతున్న ధరలతో ఆనందం

వరంగల్,**ఫిబ్రవరి 6,ప్రజావినికిడి ,**



మిర్చి రైతులకు చాలాకాలం తరవాత మంచిరోజులు వచ్చాయి. పంటలకు గణనీయంగా ధరలు పలుకుతున్నాయి. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధరలు ఘాటెక్కుతున్నాయి. గత రికార్డులను బ్రేక్ చేస్తూ వండర్‌హాట్ రకం మిర్చి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ. 38వేల ధర పలికి రికార్డు సృష్టించింది. ఏనుమాముల మార్కెట్‌కు మిర్చి రాబడులు గణనీయంగా తగ్గడంతో ధరలు పెరుగుతున్నాయని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. కాగా, బుధవారం వండర్‌హాట్ మిర్చి రూ. 37,100 ధర పలికి ఆల్‌టైం రికార్డు సృష్టించగా, ఒక్క రోజు వ్యవధిలోనే రూ. 900 పెరిగి రూ. 38వేలు పలకడం విశేషం. వరుసగా రెండు రోజుల నుంచి మిర్చి ధరలు రికార్డు స్థాయికి చేరుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వండర్‌హాట్, 341 రకాలను సాగు చేసిన రైతులకు మంచి లాభాలు వస్తున్నట్లు చెబుతున్నారు. అలాగే యూఎస్ 341 రకం మిర్చికి రూ. 26,700, దీపిక రకం మిర్చికి రూ. 27వేలు, తేజ రకం మిర్చికి రూ. 19,500, పత్తికి రూ. 7,630, మినుములకు రూ. 8,602, పెసర్లకు రూ. 8,352 గరిష్ఠంగా ధరలు పలికాయి. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో గురువారం పత్తి ధర స్వల్పంగా తగ్గింది. బుధవారం రూ. 7,700 ఉండగా ఒక్క రోజులో క్వింటాల్‌కు రూ. 70 తగ్గి రూ. 7,630కి పడిపోయింది. దీంతో ధరలో స్వల్ప తగ్గుదల చోటు చేసుకుంది. నవరి చివరి నాటికి ఫారెక్స్ నిల్వలు 723.8 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. వ్యవస్థలో ద్రవ్య లభ్యత రోజువారీ సగటున రూ. 75 వేల కోట్లుగా ఉంది.

# టీబీని పసిగట్టే ఏఐ స్టైతస్కోప్‌లు..

## వైద్య రంగంలో సరికొత్త ఆవిష్కరణ

**టీబీ స్క్రీనింగ్‌లో ఏఐ ఆధారిత డిజిటల్ స్టెతస్కోప్‌లు**


**ప్రస్తుత పద్ధతుల్లోని లోపాలకు పరిష్కారంగా కొత్త టెక్నాలజీ**

**తక్కువ ఖర్చు, రేడియేషన్ లేకుండా సురక్షితమైన పరీక్ష**

**ఊపిరితిత్తుల శబ్దాలను విశ్లేషించి వ్యాధిని గుర్తించే సామర్థ్యం**

**భారత్ వంటి దేశాల్లో ఈ విధానంపై ఆశాజనక ఫలితాలు**







చెన్నై,**ఫిబ్రవరి 6,ప్రజావినికిడి ,**
ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది మరణాలకు కారణమవుతున్న క్షయ (టీబీ) వ్యాధిని తొలిదశలోనే గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత డిజిటల్ స్టెతస్కోప్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని ఓ కొత్త అధ్యయనం తేల్చింది. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో టీబీ స్క్రీనింగ్‌లో ఉన్న లోపాలను ఈ టెక్నాలజీతో అధిగమించవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.
ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) నివేదిక ప్రకారం, ప్రస్తుత స్క్రీనింగ్ విధానాల ద్వారా ఏటా సుమారు 27 లక్షల టీబీ కేసులను గుర్తించలేకపోతున్నారు. లక్షణాలు లేని వారిని గుర్తించడం, ఎక్స్‌రే వంటి పరీక్షల అధిక ఖర్చు, రేడియేషన్ భయాలు వంటివి ఇందుకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. ఈ సవాళ్లకు ఏఐ ఆధారిత డిజిటల్ స్టెతస్కోప్‌లు సరైన పరిష్కారం చూపగలవని 'మెడ్ (సెల్ ప్రెస్)' జర్నల్‌లో ప్రచురితమైన కథనంలో అంతర్జాతీయ నిపుణులు పేర్కొన్నారు. కెనడాలోని మెక్‌గిల్ యూనివర్సిటీ పరిశోధకుడు మధుకర్ పాయ్ నేతృత్వంలోని బృందం ఈ అధ్యయనం చేసింది. ఏఐ స్టెతస్కోప్‌లు ఊపిరితిత్తుల శబ్దాలను (ఆస్కల్టేషన్), దగ్గును విశ్లేషించి వ్యాధి లక్షణాలను గుర్తిస్తాయి. మానవ చెవికి కూడా వినిపించని అతి సూక్ష్మమైన శబ్దాలను సైతం ఇవి పసిగట్టగలవని పరిశోధకులు వివరించారు. భారత్, పెరూ, దక్షిణాఫ్రికా, ఉగాండా వంటి దేశాల్లో జరిపిన ప్రాథమిక అధ్యయనాల్లో ఆశాజనక ఫలితాలు వచ్చాయి.
ఈ టెక్నాలజీ తక్కువ ఖర్చుతో కూడుకున్నది కావడమే కాకుండా, ఎలాంటి రేడియేషన్ ప్రమాదం లేకపోవడంతో గర్భిణులకు కూడా సురక్షితమని నిపుణులు తెలిపారు. ఖరీదైన ఎక్స్‌రే పరికరాలు అందుబాటులో లేని ప్రాంతాల్లో ఈ ఏఐ స్టెతస్కోప్‌లు టీబీ నిర్ధారణలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడతాయని, వైద్య సేవలను అందరికీ చేరువ చేస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# గడ్చిరోలిలో మరోమారు కాల్పులు

## ముగ్గురు మావోయిస్టుల మృతి



రాయపూర్,**ఫిబ్రవరి 6,ప్రజావినికిడి ,**
మహారాష్ట్ర – ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో పోలీస్ భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పులు జరిగాయి. గడ్చిరోలి అడవుల్లో జరిగిన ఈ కాల్పుల ఘటనలో భారీ నష్టం వాటిల్లింది. అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయని ఇంటెలిజెన్స్ సమాచారం అందడంతో.. పోలీసులు, భద్రతా బలగాలు గురువారం నుంచి గాలింపు చర్యలు చేపట్టాయి. భద్రతా బలగాలు అడవిలోకి ప్రవేశించగానే మావోయిస్టుల వైపు నుంచి కాల్పులు మొదలయ్యాయి. ప్రతిగా బలగాలు జరిపిన కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మరణించారు. ఈ హోరాహోరీ పోరులో కమాండో దీపక్ ప్రాణాలు కోల్పోగా, గాయపడిన మరో అధికారిని మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలిలో ఏకే-47, ÷ూఒఖీ స్వాధీనం చేసుకున్నాయి భద్రతా బలగాలు. ఘటనా స్థలంలో పోలీసులు.. ఆయుధాలు, విప్లవ సాహిత్యం, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆ ప్రాంతంలో ఇంకా కొందరు మావోయిస్టులు దాగిఉండే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఎన్‌కౌంటర్‌తో గడ్చిరోలి జిల్లాలో ఉత్కంఠ వాతావరణం నెలకొంది. స్థానికులను అప్రమత్తం చేసిన అధికారులు.. అటవీ ప్రాంతాల వైపు వెళ్లవద్దని సూచనలు జారీ చేశారు. ఎన్‌కౌంటర్ పూర్తైన తర్వాత మృతుల సంఖ్య, స్వాధీనం చేసుకున్న ఆయుధాల వివరాలను అధికారికంగా వెల్లడిస్తామని పోలీస్ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక



# ఆరోసారి విశ్వవిజేతగా భారత్...

● అండర్19 వరల్డ్ కప్ ఫైనల్లో ఇంగ్లండ్‌పై గ్రాండ్ విక్టరీ ● అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో ఇంగ్లండ్‌పై 100 పరుగుల తేడాతో భారత్ ఘనవిజయం ● కేవలం 80 బంతుల్లో 175 పరుగులతో విధ్వంసం సృష్టించిన వైభవ్ సూర్యవంశీ ● భారీ లక్ష్యఛేదనలో ఫల్కనర్ (115) సెంచరీతో ఒంటరి పోరాటం చేసినా ఇంగ్లండ్‌కు తప్పని ఓటమి ● టోర్నీ ఆద్యంతం అద్భుత ప్రదర్శనతో అపజయం ఎరుగకుండా టైటిల్ నెగ్గిన టీమిండియా






అండర్-19 క్రికెట్‌లో భారత యువ జట్టు మరోసారి తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. హరారే వేదికగా జరిగిన ప్రపంచకప్ ఫైనల్లో ఇంగ్లండ్‌పై 100 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. తద్వారా రికార్డుస్థాయిలో ఆరోసారి అండర్-19 ప్రపంచకప్‌ను ముద్దాడి చరిత్ర సృష్టించింది. తొలుత బ్యాటింగ్‌లో పరుగుల సునామీ సృష్టించి, ఆపై బౌలింగ్‌లో అద్భుతంగా రాణించి ఇంగ్లండ్‌ను ఆలౌట్ చేసింది. భారత్ నిర్దేశించిన 412 పరుగుల భారీ లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. బెన్ డాకిన్స్ (66), బెన్ మేయస్ (45) వేగంగా పరుగులు సాధించారు. అయితే, భారత బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు తీసి ఇంగ్లండ్‌ను దెబ్బకొట్టారు. ఒక దశలో 177 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచింది. ఈ సమయంలో కాలెబ్ ఫల్కనర్ (67 బంతుల్లో 115) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 9 ఫోర్లు, 7 సిక్సర్లతో అద్భుత శతకం బాది ఒంటరి పోరాటం చేశాడు. అతనికి జేమ్స్ మింటో (28) నుంచి కొంత సహకారం లభించినా, అది గెలుపునకు సరిపోలేదు. భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో ఇంగ్లండ్ పోరాటం 40.2 ఓవర్లలో 311 పరుగుల వద్ద ముగిసింది. భారత బౌలర్లలో ఆర్ఎస్ అంబ్రీష్ 3 వికెట్లతో సత్తా చాటగా, కనిష్క్ చౌహాన్, దీపేష్ దేవేంద్రన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు, టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టుకు ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర ఆరంభాన్ని ఇచ్చాడు. కేవలం 80 బంతుల్లో 15 ఫోర్లు, 15 భారీ సిక్సర్లతో ఏకంగా 175 పరుగులు చేసి ఇంగ్లండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతని ఇన్నింగ్స్‌తో భారత్ భారీ స్కోరుకు బలమైన పునాది పడింది. కెప్టెన్ ఆయుష్ మాత్రే (53) బాధ్యతాయుతమైన అర్ధశతకంతో రాణించగా, వేదాంత్ త్రివేది (32), విహాన్ మల్హోత్రా (30), వికెట్ కీపర్ అభిగ్యాన్ కుండు (40) విలువైన పరుగులు జోడించారు. చివర్లో కనిష్క్ చౌహాన్ (20 బంతుల్లో 37 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 411 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. ఇంగ్లండ్ బౌలర్లలో జేమ్స్ మింటో 3 వికెట్లు తీశాడు. భారత్ గతంలో 2000, 2008, 2012, 2018, 2022లో అండర్-19 కప్ ను గెలిచింది. ఇప్పుడు రికార్డు స్థాయిలో ఆరోసారి కప్ సాధించి, అండర్-19 ప్రపంచకప్ చరిత్రలో తన తిరుగులేని ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించుకుంది. మ్యాచ్ అనంతరం భారత ఆటగాళ్లు త్రివర్ణ పతాకాలను చేతబూని మైదానంలో సంబరాలు జరుపుకున్నారు.

## వరల్డ్ రికార్డులు బద్దలుకొట్టిన వైభవ్

హరారే వేదికగా జరుగుతున్న అండర్-19 వన్డే వరల్డ్ కప్ ఫైనల్‌లో భారత యువ జట్టు బ్యాట్‌తో పెను తుఫాన్ సృష్టించింది. ఇంగ్లాండ్‌తో జరిగిన తుది సమరంలో తొలుత బ్యాటింగ్ చేపట్టిన టీమిండియా మొదటి బంతి నుంచే దూకుడుగా ఆడుతూ ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి పెంచింది. ఫైనల్ మ్యాచ్ అనే ఒత్తిడిని ఏమాత్రం లెక్కచేయని భారత ఆటగాళ్లు స్కోర్ బోర్డు పరుగులు పెట్టేలా చేశారు. వచ్చిన వాళ్లు వచ్చినట్లు బాదుతూ.. మొత్తంగా 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయిన టీమిండియా 411 పరుగులు చేసింది. ఇంగ్లండ్ విజయం సాధించాలంటే 412 పరుగులు చేయాల్సిందే. ఈ మ్యాచ్‌కు అసలు హీరోగా నిలిచిన ఆటగాడు ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ. తొలి ఓవర్లలోనే ఫోర్లు, సిక్సర్లతో స్టేడియాన్ని హోరెత్తించిన వైభవ్ ఇంగ్లాండ్ బౌలింగ్ దాడిని పూర్తిగా చీల్చిచెండాడు.



## స్మృతి మంధానకు కోహ్లీ స్పెషల్ విషెస్




రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఛాంపియన్‌గా నిలవడంతో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ హర్షం వ్యక్తం చేశాడు. అద్భుతమైన విజయం సాధించిన ఆర్సీబీ మహిళల జట్టుకు, మేనేజ్‌మెంట్‌కు విరాట్ శుభాకాంక్షలు తెలిపాడు. కెప్టెన్ స్మృతి మంధాన, ఆర్సీబీ జట్టును చూసి గర్వపడాలని అన్నాడు. రెండోసారి ఛాంపియన్‌గా నిలిచి ఆర్సీబీ పతాకాన్ని అత్యున్నత స్థానంలో ఎగురవేశారని అభినందించాడు. ఈ మేరకు సోషల్ మీడియా ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ షేర్ చేశాడు. 'రెండోసారి ఛాంపియన్‌గా నిలిచి ఆర్సీబీ పతాకాన్ని అత్యున్నత స్థానంలో ఎగురవేశారు. మిమ్మల్ని చూస్తుంటే గర్వంగా ఉంది. స్మృతి మంధాన, ఆర్సీబీ జట్టు, మేనేజ్‌మెంట్‌కు శుభాకాంక్షలు. ఈ విజయానికి మీరు నిజమైన అర్హులు. ఈ అద్భుతమై క్షణాలను ఆస్వాదించండి' అని విరాట్ కోహ్లీ ఆర్సీబీ ట్రోఫీ ఫొటోను షేర్ చేస్తూ రాసుకొచ్చాడు. మహిళల జట్టు నెగ్గడంతో విరాట్ పోస్టు పెట్టడంపై ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఐపీఎల్‌లో తమ జట్టు కూడా ఇదే రిపీట్ చేయాలని ఆశిస్తున్నట్లు కామెంట్లు పెడుతున్నారు. ఈ ఫైనల్‌లో ఆర్సీబీ కెప్టెన్ స్మృతి మంధాన (87 పరుగులు, 41 బంతుల్లో) సూపర్ ఇన్నింగ్స్‌తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. అయితే మంధాన జ్వరంతో బాధపడుతూనే ఈ మ్యాచ్‌లో బరిలో దిగినట్లు ఆర్సీబీ కోచ్ మలోలన్ రంగరాజన్ తెలిపాడు. అనారోగ్యంగా ఉన్నప్పటికీ జట్టు కోసం బరిలో దిగడాన్ని ఆయన కొనియాడాడు. ఈ మేరకు మ్యాచ్ అనంతరం ప్రెస్‌మీట్‌లో రంగరాజన్ చెప్పాడు. 'ఫైనల్ మ్యాచ్‌లో మంధాన అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడింది. అయితే ఈ మ్యాచ్‌కు ముందు మంధాన తీవ్రమైన ఫ్లూతో బాధ పడుతోంది. చాలా అనారోగ్యంగా ఉంది. కానీ ఆ ప్రభావం మ్యాచ్ మీద పడలేదు. దీని గురించి నేను ఆమెతో మాట్లాడినప్పుడు, 'ప్రాబ్లమ్ ఏం లేదు, నేను ఆడతాను' అని చెప్పింది. గత ఏడాది కాలంగా ఆమె మంచి ఫామ్‌లో ఉంది. అయిత ఆమె ఈ రోజు ఆడిన ఇన్నింగ్స్‌ను వర్ణించడానికి మాత్రం నాకు మాటలు చాలడం లేదు. మంచి టైమింగ్‌తో బ్యాటింగ్ చేసింది. వీలు చిక్కినప్పుడు ఎటాకింగ్ మోడ్‌లోకీ మారింది. బ్యాటింగ్‌లో ఆమె ఒక మేధావి. తన ఆటను, నైపుణ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటుంది' అని రంగరాజన్ పేర్కొన్నాడు.

## ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా బరిలోకి దిగుతాడు

**- టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్**

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా అమెరికాతో జరిగే తొలి మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా బరిలోకి దిగుతాడని టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్పష్టం చేశాడు. ప్రస్తుతం ఇషాన్ కిషన్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడని తెలిపాడు. న్యూజిలాండ్, సౌతాఫ్రికాతోనే కాకుండా దేశవాళీ టీ20 టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలోనూ ఇషాన్ కిషన్ సత్తా చాటాడని సూర్యకుమార్ యాదవ్ గుర్తు చేశాడు. న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో ఇషాన్ కిషన్ అద్భుత ప్రదర్శన కనబర్చిన సంగతి తెలిసిందే. తిలక్ వర్మ గైర్హాజరీలో తుది జట్టులో అవకాశం అందుకున్న ఇషాన్ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. న్యూజిలాండ్‌తో ఆఖరి టీ20లో శతకం బాదిన ఇషాన్ కిషన్.. సౌతాఫ్రికాతో వామప్ మ్యాచ్‌లోనూ హాఫ్ సెంచరీతో రాణించి నిలకడను చాటుకున్నాడు. మరోవైపు న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో దారుణంగా విఫలమైన సంజూ శాంసన్ తుది జట్టులో చోటు కోల్పోయాడు. తిలక్ వర్మ రీఎంట్రీ ఇవ్వడంతో సౌతాఫ్రికాతో వామప్ మ్యాచ్‌లో టీమిండియా మేనేజ్‌మెంట్ ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా ఆడించింది. మూడో స్థానంలో ఆడిన తిలక్ వర్మ కూడా మెరుగైన ప్రదర్శన చేశాడు. దాంతో సంజూ బెంచ్‌కే పరిమితం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అమెరికాతో మ్యాచ్ నేపథ్యంలో గురువారం మీడియాతో మాట్లాడిన సూర్యకుమార్ యాదవ్‌ను ఓపెనింగ్ స్లాట్ గురించి ప్రశ్నించగా.. ఇషాన్ కిషన్ బరిలోకి దిగుతాడని చెప్పాడు. అతని దూకుడైన బ్యాటింగ్‌తో జట్టుకు ఎంతో ప్రయోజకరమవుతుందని అభిప్రాయపడ్డాడు.'గత కొన్ని మ్యాచ్‌ల్లో ఇషాన్ కిషన్ అద్భుత ప్రదర్శన కనబర్చాడు. దేశవాళీ క్రికెట్‌లోనూ సత్తా చాటాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలోనూ దూకుడుగా ఆడి తన జట్టును విజేతగా నిలబెట్టాడు. న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో ఇషాన్ కిషన్ మూడో స్థానంలో బ్యాటింగ్ చేశాడు. వార్మప్ మ్యాచ్‌లో మాత్రం ఓపెనర్‌గా వచ్చాడు. అతను ఏ స్థానంలో బ్యాటింగ్ చేసినా అదే దూకుడు కొనసాగించాలని కోరుకుంటున్నాను. ఏ స్థానంలో ఆడించినా.. తన జోరు కొనసాగిస్తాడని ఆశిస్తున్నా.'అని సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో ముగిసిన టీ20 సిరీస్‌లో సంజూ శాంసన్ దారుణంగా విఫలమయ్యాడు. ఐదు ఇన్నింగ్స్‌ల్లో కేవలం 46 పరుగులే చేశాడు. అత్యధిక స్కోరు 24 మాత్రమే. 2025 నుంచి టీ20ల్లో ఓపెనర్‌గా అతను 11 ఇన్నింగ్స్‌లలో 12.18 సగటుతో కేవలం 134 పరుగులు మాత్రమే సాధించాడు, అత్యధిక స్కోరు 37. మరోవైపు ఇషాన్ కిషన్..




## ఇంకోసారి ఆలోచించండి- లేదంటే భారీగా నష్టపోతాం

టీ20 వరల్డ్‌కప్‌లో భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నామని పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించడంతో ఈ అంశం క్రీడావర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంలో తమ వైఖరి ఇదేనని పాక్ చెప్పినప్పటికీ, ఐసీసీ ఇంకా ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో సస్పెన్స్ కొనసాగుతోంది. అయితే దీనిపై శ్రీలంక క్రికెట్ బోర్డు (రాజ) స్పందించింది. భారత్‌తో మ్యాచ్ బాయ్‌కాట్ ఆలోచనను పునఃపరిశీలించాలని కోరుతూ ఓ లేఖ రాసినట్లు తెలిసింది. ఇలాంటి చర్యలు భారీగా ఆర్థిక నష్టాలకు దారితీయవచ్చని లేఖలో ఎస్ఎల్‌సీ పేర్కొంది.'ఈ టోర్నమెంట్‌ను నిర్వహించడానికి మా దేశం ఎంతో ఆసక్తిగా ఉంది. శ్రీలంకలో జరగనున్న అన్ని మ్యాచ్‌లకు సంబంధించి ఆతిథ్య ఏర్పాట్లు, భద్రతా సన్నాహాలు, టికెట్ల అమ్మకాలు ఇప్పటికే పూర్తయ్యాయి.




## టీమిండియాకు బిగ్ షాక్

### హర్షిత్ రాణా గాయంతో జట్టుకు దూరం

### రాణా స్థానంలో సిరాజ్‌ను ఎంపిక





ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ప్రారంభానికి ముందే టీమిండియాకు బిగ్ షాక్ తగిలింది. యువ పేసర్ హర్షిత్ రాణా గాయంతో జట్టుకు దూరమైనట్లు తెలుస్తోంది. సౌతాఫ్రికాతో వామప్ మ్యాచ్‌లో హర్షిత్ రాణా మోకాలి నొప్పితో ఇబ్బంది పడ్డాడు. ఆ మ్యాచ్‌లో ఒక ఓవర్ మాత్రమే బౌలింగ్ చేసిన హర్షిత్ రాణా 16 పరుగులు ఇచ్చాడు. ఆ సమయంలోనూ రెండు సార్లు తన రనప్‌ను ఆపాడు. తన కుడి మోకాలిని పట్టుకుని తీవ్రమైన నొప్పితో మైదానాన్ని వీడాడు. ఆ తర్వాత మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టలేదు. అయితే హర్షిత్ రాణా కుడి మోకాలి జాయింట్‌లో సమస్య ఉన్నట్లు తెలుస్తోంది. స్కాన్లలోనూ ఆ విషయం వెల్లడైనట్లు జాతీయ మీడియా పేర్కొంది. వైద్యుల సూచన మేరకు హర్షిత్ రాణా మెటా టోర్నీ నుంచి తప్పుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే హర్షిత్ రాణా గాయంపై బీసీసీఐ ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. మెగా టోర్నీకి ముందు మీడియా సమావేశంలో పాల్గొన్న సూర్యకుమార్ యాదవ్‌ను హర్షిత్ రాణా గాయం గురించి ప్రశ్నించగా.. అవునని బదులిచ్చాడు. 'హర్షిత్ రాణా గాయంతో ఇబ్బంది పడుతున్నాడు. ఆ విషయం మాకు ఈ రోజే తెలిసింది. ఒకవేళ హర్షిత్ రాణా జట్టుకు దూరమైతే.. అది మాకు పెద్ద నష్టం. మేం వేరే కాంబినేషన్లను ప్రయత్నిస్తాం. అయితే మా రిజర్వ్ బెంచ్ బలంగా ఉంది.'అని సూర్యకుమార్ యాదవ్ చెప్పుకొచ్చాడు. హర్షిత్ రాణా స్థానంలో మహమ్మద్ సిరాజ్‌ను భారత సెలెక్టర్లు ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. గత టీ20 ప్రపంచకప్ 2024 గెలిచిన జట్టులో సభ్యుడైన సిరాజ్, హర్షిత్ స్థానంలో జట్టుతో చేరడానికి ఇప్పటికే ముంబై చేరుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.



## అర్జున్ కూతురు హీరోయిన్‌గా

# సీతాపయనం

### ఈనెల 14న గ్రాండ్‌గా విడుదలకు సన్నాహాలు

యాక్షన్ కింగ్ అర్జున్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన విభిన్న కథా చిత్రం 'సీతా పయనం'. శ్రీ రామ్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా ద్వారా అర్జున్ కుమార్తె ఐశ్వర్య అర్జున్ వెండితెరకు కథానాయికగా పరిచయం అవుతుండటం విశేషం. నిరంజన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో సత్యరాజ్, ప్రకాష్ రాజ్, కోవై సరళ వంటి దిగ్గజ నటులు కీలక పాత్రలు పోషించగా, అర్జున్ స్వయంగా ఒక ప్రత్యేక పాత్రలో మెరవనున్నారు. అలాగే ఆయన మేనల్లుడు, యాక్షన్ ప్రిన్స్ ధ్రువ సర్జా కూడా ఈ మూవీలో స్పెషల్ కామియో రోల్‌లో కనిపించబోతున్నారు. ఈ సినిమాను ప్రేమికుల రోజు కానుకగా ఫిబ్రవరి 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది.ప్రస్తుతం అన్ని రకాల పోస్ట్ ప్రొడక్షన్ పనులతో పాటు సెన్సార్ కార్యక్రమాలను కూడా పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఇప్పటికే పాజిటివ్ బజ్‌ను సొంతం చేసుకుంది. ప్రమోషన్స్‌లో భాగంగా ఇప్పటికే విడుదలైన పాటలు, ఇతర కంటెంట్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చే హృద్యమైన అంశాలతో పాటు, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఈ చిత్రాన్ని అర్జున్ అద్భుతంగా తీర్చిదిద్దారు. తెలుగుతో పాటు కన్నడ, తమిళం, మలయాళం మరియు హిందీ భాషల్లో ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో భారీగా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. సాంకేతికంగా కూడా ఈ సినిమా అత్యున్నత ప్రమాణాలతో రూపొందింది. జి. బాలమురుగన్ సినిమాటోగ్రఫీ అందించగా, ప్రముఖ రచయిత సాయి మాధవ్ బుర్రా పదునైన డైలాగ్స్ రాశారు. యాక్షన్ కింగ్ సినిమా అంటేనే ÷ట్స్ స్పెషల్‌గా ఉంటాయి కాబట్టి, ఈ చిత్రంలోని స్టంట్ సన్నివేశాలకు కిక్ యాస్ కాళీ కొరియోగ్రఫీ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. వినూత్న ప్రచార కార్యక్రమాలతో ప్రేక్షకుల్లోకి వెళ్తున్న మేకర్స్, త్వరలోనే సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఫిబ్రవరి 14న ఐదు భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానున్న 'సీతా పయనం' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో వేచి చూడాలి.



## మైత్రీ మూవీ మేకర్స్‌తో నవీన్ పోలిశెట్టి చిత్రం

'అనగనగా ఒక రాజు' చిత్రంతో మొదటిసారి రూ.100 కోట్ల క్లబ్‌లో చోటు దక్కించుకున్నాడు టాలీవుడ్ యంగ్ అండ్ ఎనర్జిటిక్ స్టార్ నవీన్ పోలిశెట్టి. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించి సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ విజయంతో నవీన్ పోలిశెట్టి తన కెరీర్‌లో తొలి వంద కోట్ల మైలురాయిని అందుకున్న నటుడిగా నిలిచారు. అయితే ఈ అద్భుతమైన విజయంతో ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ స్పందిస్తూ నవీన్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా తమ తదుపరి ప్రాజెక్ట్‌లో నవీన్ భాగమవుతుండడంతో ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ప్రకటించింది. అయితే మైత్రీ బ్యానర్‌లో రాబోతున్న ఈ చిత్రం ఎలా ఉండబోతుందని ప్రేక్షకులకు ఎదురుచూస్తున్నారు.


## 'ఇది భ్రమల ప్యాలెస్'

### క్యూట్ పిక్స్ షేర్ చేసిన రాశీ ఖన్నా



'ఊహలు గుసగుసలాడే' సినిమాతో తెలుగు సినీ ప్రేక్షకులకు పరిచయమైన రాశీ ఖన్నా తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ గా గుర్తింపు తెచ్చుకుంది. చివరిగా సిద్ధు జొన్నలగడ్డ సరసన 'తెలుసు కదా' చిత్రంలో కనిపించింది. ఈ సినిమాలో రాశీ ఖన్నాకు మంచి మార్కులు పడ్డాయి. ప్రస్తుతం ఆమె పవర్ స్టార్ పవన్ కల్యాణ్ సరసన 'ఉస్తాద్ భగత్ సింగ్'లో నటిస్తోంది. హరీశ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. మార్చి 26న ఈ సినిమా రిలీజ్ కాబోతోంది. ఈ సినిమాలో శ్రీలీల కూడా హీరోయిన్ గా నటిస్తోంది. మరోవైపు, రాశీ ఖన్నా తాజాగా ఇన్స్టాగ్రామ్ లో షేర్ చేసిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి. ఈ ఫొటోల్లో బ్లాక్ అవుట్ ఫిట్ తో, బ్లాక్ పెండెంట్ ఉన్న చైన్ తో రాశి బోల్డ్ గా కనిపిస్తోంది. ఈ ఫొటోలకు 'ఇది భ్రమల ప్యాలెస్' అంటూ క్యాప్షన్ పెట్టింది.

## సంగీత్ శోభన్ ప్రధాన పాత్రలో రాకాస




టాలీవుడ్ యంగ్ హీరో సంగీత్ శోభన్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'రాకాస' ఇప్పుడు సినీ ప్రియుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. 'మ్యాడ్' సినిమాతో యువ ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించిన సంగీత్ శోభన్ ఈసారి ఫాంటసీ,హారర్ జానర్‌లో కొత్త ప్రయోగంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ చిత్రంలో 'ఆయ్' మూవీ ఫేమ్ నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తుండగా, దర్శకురాలు మానస శర్మ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ సినిమాను పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై నిహారిక కొణిదెల, ఉమేష్ కుమార్ బన్సాల్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. గతంలో నిహారిక నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు' సినిమా బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోవడంతో, ఆమె నిర్మాణంలో వస్తున్న ఈ కొత్త ప్రాజెక్ట్‌పై కూడా మంచి అంచనాలు ఏర్పడ్డాయి. యువతరానికి దగ్గరగా ఉండే కథలు, కొత్త కాన్సెప్ట్‌కి ప్రాధాన్యం ఇస్తూ నిహారిక నిర్మాణంలో వస్తున్న ప్రతి చిత్రం ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంటోంది. ఇటీవల విడుదలైన 'రాకాస' టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఫాంటసీ ఎలిమెంట్స్, హారర్ బ్యాక్‌డ్రాప్, కామెడీ టచ్ అన్నీ కలగలిపి వినోదభరితంగా టీజర్ ఉండటంతో సినిమాపై బజ్ ఒక్కసారిగా పెరిగింది. సోషల్ మీడియాలో కూడా ఈ టీజర్‌కు మంచి స్పందన లభించింది. అప్పటి నుంచి సినిమా రిలీజ్ ఎప్పుడన్న ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో తాజాగా సినిమా రిలీజ్ డేట్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. 'రాకాస' చిత్రాన్ని 2026 ఏప్రిల్ 3న సమ్మర్ కానుకగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు స్పెషల్ పోస్టర్ ద్వారా వెల్లడించారు. సమ్మర్ హాలిడే సీజన్‌ను టా÷-గ్గ÷ట్ చేస్తూ వస్తున్న ఈ సినిమా ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు యువతను కూడా ఆకట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తవగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఫాంటసీ, హారర్, హిలేరియస్ కామెడీ అంశాలతో ఫుల్ ఆన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం సంగీత్ శోభన్ కెరీర్‌లో మరో ప్రత్యేక మైలురాయిగా నిలుస్తుందా అనే ఆసక్తి నెలకొంది. విభిన్న జానర్‌లో వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితం సాధిస్తుందో తెలుసుకోవాలంటే ఏప్రిల్ వరకు వేచి చూడాల్సిందే.

-----------




## శ్రీవిష్ణు 'మృత్యుంజయ' విడుదల తేదీ ఖరారు

విభిన్నమైన కథలతో ప్రేక్షకులను అలరించే హీరో శ్రీవిష్ణు నటిస్తున్న కొత్త థ్రిల్లర్ మూవీ 'మృత్యుంజయ' విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాను ఈ ఏడాది ఫిబ్రవరి 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ చిత్రంలో రెబా జాన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

ఈ సందర్భంగా శ్రీవిష్ణు తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో రిలీజ్ డేట్ పోస్టర్‌ను పంచుకున్నారు. "ఫిబ్రవరి 27న 'మృత్యుంజయ' థియేటర్లలో మీ హృదయాలను గెలుచుకోవడానికి వస్తోంది. ఈ థ్రిల్లింగ్ కథతో మిమ్మల్ని కలుస్తాను" అని రాసుకొచ్చారు. హీరోయిన్ రెబా జాన్ కూడా పోస్టర్ షేర్ చేస్తూ, "ప్రతి సమాధానం మరో ప్రాణాంతకమైన ప్రశ్నను లేవనెత్తుతుంది. ఫిబ్రవరి 27న 'మృత్యుంజయ' సినిమా హాళ్లలోకి వస్తోంది" అని పేర్కొన్నారు.

హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై మొదటి నుంచి మంచి అంచనాలు ఉన్నాయి. గతేడాది విడుదలైన టైటిల్ టీజర్, సినిమా ఒక ఆసక్తికరమైన క్రైమ్ థ్రిల్లర్ అని స్పష్టం చేసింది. ఇందులో రెబా జాన్ ఒక పోలీస్ అధికారి పాత్రలో నటిస్తుండగా, శ్రీవిష్ణు పాత్రపై సస్పెన్స్ కొనసాగుతోంది. టీజర్‌లోని కొన్ని విజువల్స్ ఆధారంగా అతను జైలులో ఖైదీగా కనిపించవచ్చని ప్రేక్షకులు అంచనా వేస్తున్నారు.

ఈ సినిమాను సందీప్ గున్నం, వినయ్ చిలకపాటి నిర్మిస్తుండగా, రమ్య గున్నం సమర్పిస్తున్నారు. కాలభైరవ సంగీతం అందిస్తుండగా, ప్రముఖ ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. విద్యాసాగర్ ని ని వ వా టో గ్రా ష్ ర్ గా

## 11న ఓటిటిలోకి అనగనగా ఒక రాజు




ఈ ఏడాది సంక్రాంతికి థియేటర్లలో విడుదలైన సినిమాల్లో 'అనగనగా ఒక రాజు' ఒకటి. ఈ మూవీ ఓటీటీ రిలీజ్ డేట్ ఖరారైంది. ఈనెల 11 నుంచి 'నెట్‌ఫ్లిక్స్' లో స్ట్రీమింగ్ కానుంది. గోదావరి నేపథ్యంతో కామెడీ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన 'అనగనగా ఒక రాజు' పండగ సినిమా అనిపించుకుంది. తన కామెడీ టైమింగ్ ఎలాంటిదో హీరో నవీన్ పొలిశెట్టి ఈ చిత్రంతో మరోసారి నిరూపించారు. ఆయనకు జోడీగా నటించిన మీనాక్షీ చౌదరి అందం, అభినయంతో ఆకట్టుకున్నారు. ఈ మూవీలో చమ్మక్ చంద్ర, 'సంక్రాంతికి వస్తున్నాం' ఫేమ్ బుల్లిరాజు, రావు రమేశ్ తదితరులు సందడి చేశారు. దర్శకుడు మారి తెరకెక్కించిన ఈ సినిమా జనవరి 14న విడుదలైన సంగతి తెలిసిందే. రూ.100? కోట్లు కలెక్ట్ చేసిన సందర్భంగా.. హీరో నవీన్‌కు ప్రొడ్యూసర్ నవీన్ ఎర్నేని తాజాగా కంగ్రాట్స్ చెప్పారు. తమ కాంబినేషన్‌లో మరో మూవీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా అని తెలిపారు. గౌరవపురం జమీందార్ గోపరాజు మనవడు రాజు (నవీన్ పొలిశెట్టి). జమీందార్ మనవడు అనే పేరు తప్ప ఆస్తులేమీ మిగలకపోవడంతో ఆర్థిక కష్టాలతో సతమతమవుతూ, పగటి కలలు కంటూ కాలం గడుపుతుంటాడు. బాగా డబ్బున్న కుటుంబానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటే జీవితంలో స్థిరపడిపోవచ్చనే నిర్ణయానికొస్తాడు. చారులత (మీనాక్షి)ని చూశాక ఆమే తన రాణి అయితే కష్టాలన్నీ గ్టటెక్కేయొచ్చని భావించి, ఆమె మనసుని గెలచుకోవాలని రంగంలోకి దిగుతాడు. మరి, చారులత మనసుని ఎలా గెలిచాడు? ఆమె జీవితంలోకి వచ్చాక రాజు కష్టాలు తొలగిపోయాయా? రాజు రాజకీయాల్లోకి అడుగుపెట్టాల్సిన అవసరం ఎందుకొచ్చింది? అన్నదే మిగతా కథ.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613